
ఆంధ్రజ్యోతి



రూపాయికి రూపాయిన్నర!

పార్టీల గెలుపోటములపై జోరుగా పందేలు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బెట్టింగ్స్

ఒక్కో నియోజకవర్గంలో రూ.7 కోట్ల వరకు..

"మా అభ్యర్థే గెలుస్తాడు. రూపాయికి రూపాయిన్నర పందెం. అబ్బే.. మా అభ్యర్థికి మెజారిటీ పదివేలపైన వస్తుంది. దీనిపై రూపాయికి రూపాయి. పాత జిల్లాలోని పది స్థానాల్లో ఆరింట ఒకే పార్టీ గెలుస్తుంది. రూపాయికి రూపాయి బెట్. రాష్ట్రంలో ఈదఫా ప్రభుత్వంలోకి వచ్చేది మా పార్టీయే. 120కిపైగా సీట్లు వస్తాయి. ఇదిగో.. ఈ రెండెకరాల పొలం బెట్ కడుతున్నా'...!

నెల్లూరు (జడ్పీ), మే 15 : సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో అభ్యర్థుల గెలుపోటములు, మెజారిటీలు, ప్రభుత్వ ఏర్పాటుపై జిల్లాలో భారీ ఎత్తున పందేలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఐపీఎల్ బెట్టింగుల్లో మునిగి తేలుతున్న పందెపు రాయుళ్లతోపాటు తాజాగా రాజకీయ నాయకుల నుంచి సామాన్యుల వరకు రూ.కోట్లలో పందేలు పెడుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాలలో ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీల మధ్య నెలకొనడంతో ఆయా పార్టీల అభ్యర్థుల పైన, ప్రభుత్వం ఏర్పాటుపైన పందేల జోరు ముమ్మరంగా ఉంది. నియోజకవర్గాలవారీగా టీడీపీ అభ్యర్థి గెలుస్తాడని కొందరు.. వైసీపీ అభ్యర్థి గెలుస్తాడని ఇంకొందరు పందేలు కాస్తుండగా, కొన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థి గెలిస్తే రూపాయి ఇవ్వండి, ఓడితే రూపాయిన్నర ఇస్తామంటూ పందేలు కాస్తున్నారు. రూపాయి అంటే రూ.లక్ష.. రూపాయిన్నర అంటే రూ.లక్షన్నర అని అర్థం ఈ పరిస్థితి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉండగా, మిగతా నియోజక వర్గాల్లో రూపాయికి రూపాయి పందెం కాస్తున్నారు. ఇప్పటికే ఒక్కో నియోజక వర్గంలో దాదాపుగా రూ. 6 కోట్ల నుంచి 7కోట్ల దాకా పందేలు పెట్టినట్లు సమాచారం. ఇక అభ్యర్థుల గెలిచే చోట మెజారిటీపై బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు కనీసంగా ఆరు సీట్లు తమపార్టీకే వస్తాయని కొంతమంది పందేలు కాస్తుండగా, అన్ని రావని ఎదురు పందేలు కాసేవారూ ఎక్కువగా ఉంటున్నారు.

● ప్రభుత్వ ఏర్పాటుపై భారీగా...

ఇక రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందన్న అంశంపైనా బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఇది రూ. కోట్లలోనే ఉంటోంది. జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వ్యక్తుల సైతం ప్రభుత్వ ఏర్పాటుపైన పందెం కాస్తున్నారు. వైసీపీ కంటే ఎన్డీఏ కూటమికి ఒక సీటు ఎక్కువగా వస్తుందని కొందరు, కూటమి కంటే వైసీపీకే ఎక్కువ సీట్లు వస్తాయని కొందరు పందెం కోసం సిద్ధమవుతున్నారు. అలాగే ఈసారి మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందని కొందరు, అంతసీన్ లేదు.. ఎన్డీఏ కూటమిదే ప్రభుత్వమని పందెం కాస్తున్నారు. ఇలా ఎన్ఆర్ఐలతోపాటు ప్రముఖ పార్టీల నాయ కులు, అభ్యర్థులు సైతం పందెం కాస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా వచ్చే నెల నాల్గవ తేదీన వెల్లడయ్యే ఫలితాలపైనే పందె పురాయుళ్లతోపాటు రాజకీయన నాయకులు, అన్నివర్గాల ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు.

● ఉలవపాడులో రూ.12 లక్షలు

ఉలవపాడు : కందుకూరులో విజయంపై ఇరుపార్టీల నాయకులు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. వైసీపీ వర్గీయులు బుర్రా మధుసూదన్ గెలుస్తాడని రూ.10 లక్షలకు సై అంటే.. టీడీపీ వర్గీయులు ఇంకో రెండు లక్షలు కలిపి ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలుస్తాడని పందేనికి దిగారు. మరొకరైతే వైసీపీ గెలుపుపై ఎకరం భూమిని బెట్టింగ్‌లో పెట్టాడు. ఉలవపాడు మండలం 4 నుంచి 5 వేల మెజారిటీ వైసీపీకి వస్తుందని రూ. 1 లక్ష మన్నేటకోటకు చెందిన నాయకులు పందెం కాయగా, 2019 ఎన్నికల్లో 5800 మెజారిటీ వచ్చింది ఇప్పుడు సమం చేస్తూ ఒక్క ఓటైనా టీడీపీకి మెజారిటీ వస్తుందే కానీ వైసీపీకి రాదని లక్ష ఎదురు పందెం కాసినట్టు సమాచారం.

● కోవూరులోనూ జోరుగా..

కోవూరు : కోవూరు నియోజకవర్గ ఫలితం, అభ్యర్థుల మెజారిటీపై పందేలు జోరుగా సాగుతున్నాయి. నగదుతో పాటు పొలాలను కూడా పందెంలలో పెడుతున్నారు. గ్రామాలు, పోలింగ్ స్టేషన్లవారీగా మెజారిటీల విషయమై పందేలకు దిగుతున్నారు. అంతేగాక ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపడతారనే అంశంపైనా జోరుగా చర్చలు సాగి పందెం కాస్తున్నారు.





నియోజకవర్గాల నుంచి నెల్లూరుకు చేరుకున్న ఈవీఎంలు

తేలిన ఓటింగ్ లెక్క!


● జిల్లాలో 79.63 శాతం పోలింగ్ నమోదు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), మే 15 : రెండ్రోజుల తర్వాత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ లెక్క తేలింది. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగ్గా 14వ తేదీన ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఆ తర్వాత బుధవారం పూర్తి పోలింగ్ వివరాలను అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో సరాసరి 79.63 శాతం పోలింగ్ నమోదయినట్టు ప్రకటించారు. అత్యధికంగా కందుకూరులో 88.96 శాతం, అత్యల్పంగా నెల్లూరు రూరల్‌లో 67.76 శాతం పోలింగ్ జరిగింది. ఇక సర్వేపల్లిలో 83.88 శాతం, కావలిలో 83.03 శాతం, ఆత్మకూరులో 83.49 శాతం, కోవూరులో 79.29 శాతం, నెల్లూరు సిటీలో 71.72 శాతం, ఉదయగిరిలో 81.92 శాతం పోలింగ్ జరిగింది. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జిల్లాలో 1.20 శాతం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లెక్కన మొత్తం చూసుకుంటే జిల్లాలో దాదాపు 81 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2019లో 78.5శాతం పోలింగ్ జరిగింది. అప్పటితో పోల్చుకుంటే 2 శాతంపైగా పోలింగ్ శాతం పెరిగింది.

నేటి నుంచి వేదగిరిపై
బ్రహ్మోత్సవాలు

21న బంగారు గరుడసేవ, 22న కల్యాణం ● 23న రథోత్సవం, 26తో ముగింపు

భారీగా ఏర్పాట్లు చేసిన దేవదాయ శాఖ



ఆలయం ఎదుట గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నెల్లూరురూరల్, మే 15 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం మొదలుకానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు, దేవదాయ శాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. నేటి ఉదయం అంకురార్పణతో శ్రీవారి ఉత్సవాలు మొదలుకానుండగా, భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనంపై శ్రీవారు ఊరేగనున్ననరు. 18న చప్పర ఉత్సవం, రాత్రికి హంసవాహన సేవ, 19న సింహవాహన సేవ, 20న హనుమంత సేవ, 21 మోహిని ఉత్సవంతో అఖండ జ్యోతి, మూలవర్లకు అభిషేకం అనంతరం బంగారు గరుడ సేవ జరగనుంది. 22న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిల సమేతంగా లక్ష్మీనరసింహస్వామి వార్ల కల్యాణం, 23న నరసింహపురంలో రథోత్సవం జరగనుంది. 25న చక్రస్నానం, 26న పుష్పయాగం అనంతరం ఏకాంతసేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సౌకర్యం, పార్కింగ్ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. అలాగే నెలూరులోని ములుముడి బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబా టులోకి తెస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో గిరికృష్ణ తెలిపారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

నెల్లూరు(విద్య), మే 15 : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాగిన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు కూడా అదే వెబ్‌సైట్ నుంచి జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని ఉపయోగించి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

26న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జిల్లాలో 2024వ సంవత్సరం టెన్త్ పరీక్షల్లో 475 మార్కులకు పైగా సాధించిన యాదవ విద్యార్థులకు ఈనెల 26వ తేదీన నగరంలోని జెట్టి శేషారెడ్డి భవనంలో ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్నట్లు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన యాదవ విద్యార్థులు సంబంధిత తేదీన టెన్త్ మార్కుల జాబితాలో హాజరు కావాలని తెలిపారు.

'ప్రకాశం'లో పర్మిట్లు
జిల్లాలో తవ్వకాలు!

- క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల్లో వెలుగుచూస్తున్న వాస్తవాలు
- 90 వేల మెట్రిక్ టన్నులు తరలించినట్లు నిర్ధారణ
- 30 మంది లీజుదారులకు నోటీసులు
- రూ.వందల కోట్ల ప్రజా సంపద స్వాహా

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమాలు, అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లు వైసీపీ ప్రభుత్వంలో తెల్లరాయి (క్వార్ట్జ్) అక్రమాల బాగోతం జరిగింది. తీగలాగితే డొంక కదులుతున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు తేలుతుండడం సంచలనాన్ని సృష్టిస్తోంది. అసలు జిల్లాలో ఇన్ని లక్షల టన్నులకు పర్మిట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ ఖనిజాన్ని దేశం నుంచి ఎలా దాటించగలిగారు అన్న కోణంలో విచారణ సాగించగా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇతర దేశాలకు తరలిన తెల్లరాయికి ప్రకాశం జిల్లాలో పర్మిట్లు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రకాశం జిల్లాలో ఈస్థాయిలో క్వార్ట్జ్ రాదు కదా మరి పర్మిట్లు ఎలా ఇచ్చారయ్యా.. అని లోతుగా పరిశీలించగా ప్రభుత్వ స్థాయిలో పెద్దల హస్తం ఉన్నట్లు బయటపడింది. నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్‌కు పర్మిట్లు ఆపేయడంతో ప్రకాశం జిల్లాలో తవ్వుతున్నట్లు పర్మిట్లు తెచ్చుకొని ఆ ముసుగులో నెల్లూరు జిల్లాలో ఖనిజాన్ని కొల్లగొట్టారు. ఇలా సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను ప్రకాశం జిల్లాలోని పర్మిట్ల ద్వారా నెల్లూరులో అక్రమంగా తవ్వి రాష్ట్రం, దేశం దాటించారు. అంతర్జాతీయ మార్కెట్లో టన్ను క్వార్ట్జ్ విలువ రూ.30 వేలకుపైగా ఉంది. ఆ లెక్కన చూసుకుంటే సుమారు రూ.270 కోట్ల ప్రజా సంపదను అక్రమంగా తవ్వి తరలించారు.

● లీజుదారులకు నోటీసులు

ఈ వ్యవహారంలో 30 మంది ప్రకాశం జిల్లా లీజుదారులకు మైనింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎక్కడ తవ్వకాలకు పర్మిట్లు తీసుకున్నారు? అక్కడ ఎంత తవ్వారు..? ఆ పర్మిట్లు నెల్లూరు జిల్లాకు ఎందుకొచ్చాయి? ఏ మేరకు ఎగుమతులు చేశారు? అందుకు సంబంధించిన లెక్కలు? ఇలా అనేక అంశాలపై సదరు లీజుదారుల నుంచి రాబట్టేందుకు మైనింగ్ అధికారులు విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనధికారికంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపిన వైసీపీ నేతలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ కుంభకోణంలో అసలు సూత్రధారులు వైసీపీ పెద్దలు అయినప్పటికీ వారెక్కడా ప్రత్యక్షంగా కనిపించలేదు. అయితే వారి అనుచరుల ద్వారా ఈ అవినీతి బాగోతాన్ని నడిపించారు. ఇప్పుడు వారందరూ ఇరుక్కుపోతు న్నారు. ఆ కోవలోనే ఇప్పుడు వీరి కోసం పర్మిట్లు తీసుకున్న ప్రకాశం జిల్లాలోని వ్యక్తులు కూడా ఇరుక్కుపో యారు. కాగా నెల్లూరు జిల్లాలోని క్వార్ట్జ్‌ను లీజు మాటున వైసీపీ నాయకులకు అధికారికంగా కట్టబెట్టే ప్రయత్నాలు కొన్ని నెలల క్రితం జరిగాయి. తవ్వకాలకు టెండర్లు పిలిచినా అనూహ్యంగా రద్దు చేశారు. ఆ తర్వాతనే ప్రకాశం జిల్లా పర్మిట్లు ఇప్పించి వాటి ద్వారా జిల్లాలో విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టారు. ఏదిఏమైనా విచారణలో మున్ముందు ఇంకెన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.



తవ్వకాల నుంచి వెలికితీసిన తెల్లరాయి (ఫైల్)

వారొచ్చేదాకా
వీరే దిక్కు!

- మార్కెట్లోకి ఉలవపాడు మామిడి
- జాతీయ రహదారిపై వెలుస్తున్న అంగళ్లు
- ఇతర ప్రాంతాల వ్యాపారుల రాక ఆలస్యం
- చిరువ్యాపారులపైనే సాగుదారుల ఆశలు
- రోజుకు నలభై టన్నుల వరకు విక్రయం

ఉలవపాడు, మే 15 : మామిడి కాయల సీజన్ వచ్చిందంటే ఉలవపాడు జాతీయ రహదారి వెంట ఇరువైపులా అంగళ్లు వెలుస్తాయి. ఉలవపాడుతో పాటు చుట్టుపక్కల మండలాలైన గుడ్లూరు, సింగరాయకొండ, కందుకూరు, కావలి రూరల్ మండలాల్లో వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఉలవపాడుకు చెందిన రైతులే ఎక్కువగా చుట్టు పక్కల మండలాల్లో తోటలను కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఆయా ప్రాంతాలలో పంటకొచ్చిన కాయలను ఇక్కడ నుంచే ఎగుమతి చేస్తుంటారు. అందుకే గుంటూరు, విజయవాడలతోపాటు బయట రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు ఉలవపాడు నుంచే తమ లావాదేవీలు కొనసాగిస్తున్నారు. అయితే వారు నూజివీడు, కడప మామిడి సీజన్ పూర్తయ్యేవరకు ఉలవపాడు వైపు చూడరు. అలాంటి సమయంలో జాతీయ రహదారికి ఇరువైపులా వెలసిన అంగళ్ల నిర్వాహకులు మామిడి రైతును ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్నారు. ఉలవపాడు, రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి గ్రామాలకు సంబంధించిన చిరు వ్యాపారులు సుమారు 100 మంది దాకా ప్రతి ఏడాది ఏప్రిల్ మొదలు అంగళ్ల కోసం పందిళ్లు వేసుకుంటారు. రోజుకు సరాసరిన 30 నుంచి 40 టన్నులు మామిడి వ్యాపారం ఇక్కడ నుంచే జరుగుతుంది. రైతు నమ్మకం మీద ముందస్తుగా అంగళ్లకు సరుకు తోలి 2, 3 రోజుల తర్వాత డబ్బులు తీసుకుంటారు. హైవేపై ఈ అంగళ్లు లేకుంటే ఎప్పటికో బయటి నుంచి వచ్చే వ్యాపారుల కోసం ఎదురుచూసి ముందస్తు చేతికొచ్చిన పంట అమ్ముడుపోక సాగుదారు నష్టపోయేవాడు.

అందుబాటులో ధర

మే నెల మూడో వారం వచ్చిందంటే మామిడి కాయలు క్రమేణా పక్వానికి వచ్చినట్టే. దీంతో పంట చేతికి వచ్చేసరికి చెట్లమీద నిలబడటం కష్టం అందుకే వచ్చిన రేటుకు అమ్ముకోవడానికే రైతు చూస్తుంటాడు. ఈ క్రమంలో ప్రస్తుతం బంగినపల్లి టన్ను మేలి రకం రూ. 50 వేల వరకు పలుకుతోంది. ఈ నెలాఖరుకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఉలవపాడుకు చేరుకుని, నాణ్యతను బట్టి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తారు. చివరి దశ వరకు కాపు నిలుపుకున్న రైతులకు సుమారు టన్ను ధర రూ.70 వేల నుంచి 80 వేల వరకు పలికే అవకాశాలు ఉంటాయి. ఏప్రిల్‌లో కొద్దిపాటి వర్షం కురిసి ఉంటే కాయ సైజు పెరిగి ధర ఆశాజనకంగా ఉండేదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఆశించినంత దిగుబడి లేదని, ఉన్న పంటను ఎలాంటి ప్రకృతి ఆటంకాలు సంభవించకుండా చివరి వరకు అమ్ము కుంటే కొంతలో కొంత ఊరట ఉంటుందని అంటున్నారు.



ఉలవపాడు జాతీయ రహదారి వెంట ఒకవైపు వెలసిన మామిడి కాయల దుకాణాలు



బీసీజీ వ్యాక్సిన్

వయోజనులకు నేటి నుంచి క్షయ వ్యాక్సిన్

నెల్లూరు (వైద్యం), మే 15 : సాధారణంగా ఇప్పటి వరకు పుట్టిన పిల్లలకు వేసే క్షయ వ్యాక్సిన్ బీసీజీని తొలిసారిగా గురువారం వయోజనులకు వేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో తొలిదశలో నెల్లూరు జిల్లా ఉంది. 18 ఏళ్లు నిండి షుగర్ వ్యాధితో బాధపడేవారికి, 60 ఏళ్లు నిండిన వారికి, ఇప్పటికే క్షయ మందులు వాడి కోలుకున్న వారికి ఈ వ్యాక్సిన్ వేయనున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్న కుటుంబ సభ్యులకు కూడా ఈ వ్యాక్సిన్ వేస్తారు. ఎవరెవరికి ఈ వ్యాక్సిన్ వేయాలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఓ జాబితా సిద్ధం చేశారు. ఇప్పటికే 3 లక్షల డోసుల వ్యాక్సిన్ జిల్లాకు రాగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వాటిని చేర్చారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నియంత్రణ అధికారి మాట్లాడుతూ నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

వేట విరామం.. కదలని తెప్పలు



అల్లూరు, మే 15 : సముద్రం లో చేపల వేటకు విరామం కావడంతో తెప్పలన్నీ తీరానికి చేరాయి. ప్రతీఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట విరామం ప్రకటించడం ఆనవాయితీ. సముద్రంలో చేపలు ఉత్పత్తి చేసే కాలం కావడంతో మత్స్యకారులు వేటకు వెళ్ల కూడదని తమ కట్టుబాటుగా మత్స్యకారులు దురాయి వేసుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఎవరైనా చేపల వేటకు వెళ్తే నౌకాదళంలోని ఓ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటారు. వేటకు వచ్చిన వారిని అదుపులోకి తీసుకుంటారు. ఈ కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా తమ తెప్పలను తీరప్రాంతంలో రెండు నెలల పాటు నిలిపి వేసి విరామం ప్రకటించారు.

గ్రామాల్లో వైసీపీ నాయకుల బరితెగింపు

- టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

వెంకటాచలం, మే 15 : మండలంలోని అనికేపల్లి, సర్వేపల్లి, వెంకటాచలం తదితర గ్రామాల్లో టీడీపీ సానుభూపతిపరులు, నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వైసీపీ మేకలు దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నాయి. వాటిని అదుపు చేయాల్సిన పోలీసులు చేతులెత్తేసుండటంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఒకటైన అనికేపల్లిలో ఎన్నికలు ముగిసిన తర్వాత గొడలు జరుగుతాయేమోనని పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసుల సమక్షంలోనే దాడులకు బరి తెగించారు. సీఐ అంకమరావు, ఎస్‌ఐ రాజేష్ వైఫల్యం వల్లే గ్రామంలో గొడవలు జరుగుతున్నాయని గ్రామ స్థులు మండిపడుతున్నారు. బుధవారం ఉదయం పోలీసుల పికెట్ వద్ద టీడీపీ నాయకులు గుండెబోయిన వెంకటేశ్వర్లు, తురకా శీనయ్యల పై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. దీనిపై పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రా మస్థులు ఆరోపిస్తున్నారు. పైగా పోలీసుల మద్దతు తమకే ఉందంటూ వైసీపీ నాయకులు చెబుతున్నా రంటూ ఆవేదన చెందుతున్నారు.

● సర్వేపల్లిలో టీడీపీ ప్రచారాల్లో చురుకుగా పాల్గొన్న ఆ పార్టీ నేత గంపా విజయ్ ఇంటిపైకి మంగళవారం వైసీపీ శ్రేణులు దౌర్జన్యం చేశాయి. రాడ్లు, కర్రలతో వెళ్లి తడికెలు పీకి పడేసి విధ్వంసం సృ ష్టించారు. విజయ్ ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమా దమే తప్పింది. టీడీపీ నాయకులతో కలిసి విజయ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ అంకమరావుకు ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు తీసుకోకపోగా తప్పు తనదేనంటూ సీఐ దబాయిం చారని విజయ్ వాపోయాడు.

● వెంకటాచలంలో టీడీపీ మద్దతుదారు షేక్ నూర్జహాన్ ఇంటిపైకి వైసీపీ నాయకులు గొడవకు వెళ్లారు. మహిళ అని చూడకుండా అసభ్య పదజాలంతో తిడుతూ స్థానికుల ఎదుటే మద్యంమత్తులో దాడికి పాల్పడ్డాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన నూర్జహాన్‌పై కొందరు పోలీస్ సిబ్బంది వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా నీదే తప్పు అని చెప్పడంతో ఆమె తన బాధను నలుగురికి చెప్పుకొని వాపోయింది.

టీడీపీ నాయకులపై వైసీపీ సర్పంచి కుమారుల దాడి

తోటపల్లిగూడూరు, మే 15 : మండలంలోని చింతోపు గ్రామంలో మంగళవారం రాత్రి 12గంటల సమయంలో టీడీపీ నాయకులు మనుబోలు చంద్ర శేఖర్, అతని తల్లి దొరసానమ్మపై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ కుమారులు లేబూరు మహేష్, లేబూరు బాలాజీ దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓటు వేయాలని ఇంటింటికి తిరుగుతావా ఈ ఊరిలో నిన్ను లేకుండా చేస్తానని దుర్భాషలాడుతూ దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని స్థానికులు తెలిపారు. స్థానికుల సహాయంతో 108లో వారిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ జంపానీకుమార్ తెలిపారు.



గాయపడిన చంద్రశేఖర్‌ను 108 సహాయంతో వైద్యశాలకు తీసుకెళ్తున్న సిబ్బంది



పెన్నా వరదలకు నీట మునిగిన పొలాలను పడవల్లో వచ్చి పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఇసుక తవ్వకాల వల్లే

వరద ముప్పు

- బాధితులకు నేటికీ అందని పరిహారం



పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రం

బుచ్చిరెడ్డిపాళెం, మే15: రెండున్నర ఏళ్ల క్రితం కోవూరు నియోజకవర్గంలోని గ్రామాలను జలమయం చేసి, వేలాది కుటుంబాలను రోడ్డున పడేసిన వరద పాపం ఎవరిది..? అందుకు కారణం పెన్నాలో ఇసుక తవ్వకాలేనని కళ్లముందే కనిపిస్తున్నా ఎవరూ నోరు విప్పని పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం యథేచ్ఛగా చేపట్టిన ఇసుక తవ్వకాల వల్లే వరద ముప్పు వాటిల్లిందని అందరికీ తెలిసినా ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితులు నేడున్నాయి. పెన్నానదిలో తీరం నుంచి సుమారు 20నుంచి 30అడుగులలోతు ఇసుక తవ్వకాలకు తీరంలోని పోడు ఇసుకదిబ్బలన్నీ పోయి పెన్నానదికి వచ్చిన (6లక్షల క్యూసెక్కుల) వరద ప్రవాహం ధాటికి పొర్లుకట్టలు కూడా తెగిపోయాయి. వరదలతో బుచ్చి మండలం మినగల్లు దగ్గర్నుంచి దామరమడుగు వరకు, ఆపైన కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని ప్రజలు అతలాకుతలం అయ్యారు. కొంతమంది జనాలు, మూగజీవాలు, ఇళ్లు, పైర్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోగా, వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయి. అయినా బాధితులకు నేటికీ కూడా పరిహారం అందలేదు.

- రూ. 600 కోట్ల మేర నష్టం అంచనా

వరదలకు కోవూరు నియోజకవర్గంలో మొత్తం ఏడువేల కుటుంబాలకుపైగా నిరాశ్రయులయ్యారు. ఇళ్లు జలమయం కావడంతోపాటు రొయ్యలు, చేపలగుంతల కట్టలు తెగాయి. రైతులు సాగు చేసిన పైర్లు, వ్యవసాయమోటార్లు, పైపులైన్లు, బోర్లు దెబ్బతిన్నాయి. ఎన్నో మూగజీవాలు చనిపోయాయి. వీటన్నింటి నష్టం సుమారుగా రూ. 600కోట్లని అధికారులకు బాధితులు వివరించారు.

వరద ముప్పు ఉందని చెప్పినా వినలేదు..



పెన్నానదిలో మినగల్లు వద్ద 30అడుగుల మేర ఇసుక తవ్వకాలవల్ల వరద ముప్పు తప్పదని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా వినలేదు. వైసీపీలోనే ఉన్నా గ్రామస్థులంతా పార్టీలకతీతంగా నిరసనలు చేపట్టినా, పట్టించుకోకుండా మాపైనే కేసులు పెట్టారు. వరదలు రానే వచ్చాయి. కోవూరు నియోజకవర్గం మునిగింది. వరదకు కారణమైన ఇసుక రీచ్ ప్రాంతాలను సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించారు. అయినా పరిహారం అందలేదు సరికదా.. మళ్లీ ఇసుక తవ్వకాలు ప్రారంభించారు.

\- బొర్రు రాము, మినగల్లు సేవా సమితి అధ్యక్షుడు, మినగల్లు

మూడు రోజులు వరద నీటిలోనే ఉన్నాం...



ఇసుక తవ్వకాల వల్ల పొర్లుకట్టలు తెగి మావూరు మునిగిపోయింది. రాత్రి అన్నంతిని పడుకున్నాం. అర్ధరాత్రి 12గంటలకు మెలుకవ వచ్చి చూస్తే అప్పటికే వరద నీళ్లు చుట్టుముట్టేశాయి. దిక్కుతోచక మా ఆయన నన్ను భుజం మీద వేసుకోగా కొంచెం దూరంలోని ఓ ఇంటికి చేరుకున్నాం. మూడు రోజులు ఆఇంట్లోనే మిద్దెపైన వాళ్ళు, మేము, ఇంకొంతమందిమి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపాం. వరదలు తగ్గిన తరువాత పడవల్లో గట్టుకు చేరుకుని బతికి బయటపడ్డాం.

\- మారెళ్ల శీనమ్మ, దళితవాడ, పెనుబల్లి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	162
లేయర్ లైవ్	107
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	182

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6944
వెండి కిలో ధర	రూ. 87,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00



విస్తరిస్తున్న డెంగ్యూ!

- వేసవిలోనూ పెరుగుతున్న దోమలు
- మేలుకోకపోతే ప్రాణాపాయమే..
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినం

నెల్లూరు(వైద్యం), మే 15 : జిల్లాలో డెంగ్యూ వ్యాధి విజృంభిస్తోంది. వేసవి తీవ్రతలోనూ దోమల బెడద ఎక్కువగా ఉండటంతో డెంగ్యూ కారక దోమలు తమ ప్రతాపాన్ని చూపుతోన్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రస్తుతం 130కి పైగా డెంగ్యూ కేసులు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నా ఈ కేసులు 220కి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో డెంగ్యూ విజృంభణ ఎలా ఉందో తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది డెంగ్యూ బారినపడి మరణించగా కొందరు వ్యాధిగ్రస్థులు చెన్నైలో చికిత్స పొందుతున్నారు. గత ఏడాదిలో డెంగ్యూ కేసులు తక్కువగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నా, ఈ ఏడాది సీజన్‌లో వ్యాధిగ్రస్థులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జ్వరాల బారిన పడ్డ ఎంతో మంది బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ప్రస్తుతం ఆయా ఆసుపత్రులలో డెంగ్యూకు సరైన వైద్యం అందకపోవడంతో పేదలు సైతం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వస్తోంది. గ్రామ స్థాయిలో డెంగ్యూ జ్వరాల నియంత్రణలో వైద్య ఆరోగ్యశాఖ విఫలం అవుతోందని పలు ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. ఇదిలాఉంటే మే 16వ తేదీన జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రభుత్వం తీర్మానించింది.

మార్గదర్శకాలు అమలు చేయరా..?

ప్రపంచ ఆరోగ్య సంస్థ డెంగ్యూ వ్యాధి నిర్ధారణలో కొన్ని మార్గదర్శకాలను సూచించింది. ర్యాపిడ్ పరీక్ష ద్వారా డెంగ్యూ నిర్ధారణ అయితే దీన్ని పరిగణలోకి తీసుకుని వైద్య చికిత్సలు అందించాలి. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ పరీక్షలో గుర్తించిన డెంగ్యూను పరిగణలోకి తీసుకోమంటూ తేల్చి చెపుతోంది. డెంగ్యూ వ్యాధిని నిర్ధారించాలంటే ఎలీషా పరీక్ష తప్పనిసరి అంటుంది. ఈ పరీక్ష కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో ఉన్నా ఆ ఫలితాలు పరిగణలోకి తీసుకోమంటూ కేవలం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రభుత్వం ఆసుపత్రుల పరీక్షే ప్రామాణికమంటుండటంతో వైద్యశాఖ తీరుపై వైద్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే ఎలీషా పరీక్షలు చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు లేవు. సకాలంలో ఎలీషా పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. పరిస్థితి విషమించితే చెన్నైయ్‌కి పరుగులు తీయాల్సి వస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలోని పలు మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్నా వాటి సంఖ్య చాలా తక్కువగానే ఉంది. అయితే నెల్లూరు నగరంలోనే ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అలాగే కలువాయి, నెల్లూరు రూరల్, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, బోగోలు, కలిగిరి, కావలిరూరల్, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు తదితర మండలాల్లో ఇప్పటికే డెంగ్యూ జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ జ్వరంగా భావించి చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్థులకు చివరకు డెంగ్యూ వ్యాధిగా నిర్ధారణ కావ డంతో ఆందోళన మొదలవుతోంది. ప్రభుత్వ వైద్యసేవలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు, ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూపై అవగాహన పెంచు కుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

గత మూడేళ్లలో డెంగ్యూ వ్యాధిని పరిశీలిస్తే..

సంవత్సరం	ప్రభుత్వం గుర్తించినవి	ప్రైవేట్ ఆసుపత్రులలో..
2021	26	125
2022	148	210
2023	91	150
2024 (ఏప్రిల్)	130	220

డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో డెంగ్యూ వ్యాధిగ్రస్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నాం. ప్రతి పీహెచ్‌సీలో డెంగ్యూ అనుమానితులకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్సకు సిఫార్సు చేస్తున్నాం. డెంగ్యూ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. నీటి నిల్వల్లో దోమల లార్వా పెరుగుతోంది. దీనిపై ప్రతి శుక్రవారం పర్య టించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాము.

\- డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

విజయం ఎన్డీఏ కూటమిదే!

- 130కిపైగా స్థానాల్లో గెలుస్తున్నాం
- ఇప్పటికీ పోలీసు తీరు మారలేదు!
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), మే 15 : రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది ఎన్డీఏ కూటమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. 130కిపైగా స్థానాల్లో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ ముగిశాక వైసీపీ నేతల స్వరం మారిందని, దీన్నిబట్టి మరిన్ని ఎక్కువ సీట్లు కూటమికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు.. చంద్రబాబు నాయ కత్వం ఈ రాష్ట్రానికి అవసరమని భావించి పెద్ద ఎత్తున ఓటు వేసేందుకు తరలివ చ్చారని చెప్పారు. గడిచిన ఐదేళ్లుగా భయాం దోళనలో పనిచేసిన అధికారులు ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించి, రాష్ట్ర భవిష్యత్ కోసం పోరాడారన్నారు. ఎన్నికలకు ముందు వైనాట్ 175 అని చెప్పుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు కనీసం 75 స్థానాలైనా వస్తాయని చెప్పుకునేందుకు వెనకాడుతున్నారని ఎద్దేవా చేశారు. అయితే, ఎన్నికల సమయంలోనూ పోలీసుల తీరు మారలేదని రవిచంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు అభ్యర్థి లేక చీఫ్ ఏజెంట్ వెళ్లాలన్నా వంద నిబంధనలు చెప్పే పోలీసులు.. వందలాది మంది వైసీపీ గూండాలు రాడ్లు, సమ్మెటలు తీసుకుని తిరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు పోలీసు యూనిఫాం వేసుకున్న వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అల్లూరు, బీరంగుంట పంచాయతీలలో కూడా వైసీపీ నేతల కనుసన్నల్లో పోలీసులు మెలిగారని విమర్శించారు. నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వైసీపీపై వ్యతిరేకత, భవిష్యత్‌పై నమ్మకంతో ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలూ గెలుస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్.శివప్రసాద్, రూప్‌కుమార్ యాదవ్, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జన్ని రమణయ్య, కాకర్ల వెంకట్, రవీంద్రబాబు, హరికృష్ణ, అమ్ములా తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేత బీద రవిచంద్ర

గౌరవ వేతనంలో వ్యత్యాసం తగదు

కోవూరు, మే15: ఎన్నికల విధులకు హాజరైన ప్రభుత్వ సిబ్బందికి గౌరవవేతనం చెల్లించడంలో వ్యత్యాసం తగదని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బచ్చు డేవిడ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదనరావు అన్నారు. కోవూరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చెల్లించిన గౌరవవేతనం తెలంగాణతో పోల్చుకుంటే తక్కువగా ఉందన్నారు. రాష్టంలో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా చెల్లించారని చెప్పారు. వేసవి సెలవుల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సరెండర్ లీవు మంజూరు చేయాల్సిందిగా వారు డిమాండు చేశారు. గౌరవ వేతనం విషయమై తమ సంఘ రాష్ట్ర నాయకులు గణపతిరావు,ప్రకాష్‌రావు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వివరించారని తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

అనంతసాగరం: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని ఉప్పలపాడు వద్ద 565 జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉప్పలపాడు బస్‌షెల్టర్ వద్ద ఆగి ఉన్న పాసింజర్ ఆటోను బద్వేల్ నుంచి వరి కుంటపాడుకు వెళ్తున్న అప్పి ఆటో ఢీకొంది. దీంతో ముస్తాపు రానికి చెందిన ఆటోడ్రైవర్ మల్లెం కొండయ్య (33) తీవ్రంగా గాయపడగా 108 వాహనం ద్వారా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లగా అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడితే.. అంతే!

- ప్రమాదభరితంగా సోమశిల ప్రాంగణం
- రక్షణ ఏర్పాట్లు, ప్రమాద సూచికలు కరువు

అనంతసాగరం, మే 15: సోమశిల జలాశయం ముందు వైపు ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లు, ప్రమాద సూచికలు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. ఈ క్రమంలో ఇక్కడకు వచ్చే వారు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. జలాశయం ముందు ఆప్రాన్ ప్రాంతంలో దిగువ సుమారు 25 అడుగుల లోతున గోతులు ఉన్నాయి. అక్కడ రక్షణ గోడ లేదు. ఇక 11, 12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా అయ్యే, రాకపోకలకు ఏర్పాటు చేసిన వంతెనకు ఇరువైపులా అప్పట్లో ఏర్పాటు చేసిన స్తంభాలు వరదల సమయంలో ప్రవాహానికి కొట్టుకుపోయాయి. వాటిస్థానంలో కొత్తవి అమర్చిన దాఖలాలు లేవు. కొంచెం ఏమరుపాటుగా ఉన్నా పెను ప్రమాదం దాపురించే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.



స్తంభాలు లేక ప్రమాద భరితంగా ఉన్న ప్రాంతం



ఆప్రాన్‌లో రక్షణ గోడ, సూచిక లేక..

- 7.817 టీఎంసీల నీటి నిల్వ

సోమశిల జలాశయంలో ప్రస్తుతం 7.817 టీఎంసీల నీటి నిల్వ ఉంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు. కాగా, దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

- ఒకరు మృతి
- ఇద్దరికి గాయాలు

కలువాయి, మే 15 : రెండు మోటారు సైకిళ్ల ఢీకొని ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన కలువాయి - బ్రాహ్మణపల్లి మధ్యలో బుధవారం జరి గింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నా యి. అనంతసాగరం మండ లం సోమశిల గ్రామానికి చెందిన రాచూరి వెంకటేశ్వర్లు (50) పొదలకూరు నుంచి మోటారుసైకిల్‌పై సోమశిలకు వెళుతున్నాడు. అదేవిధంగా కలువాయి మండలం ఉయ్యాలపల్లికి చెందిన పాముర్తి నగేష్, యానాదయ్యలు ఉయ్యాలపల్లి నుంచి మోటారుసైకిల్‌పై కలువాయి వైపు వస్తున్నారు. రెండు మోటారు సైకిళ్ల ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాచూరి వెంకటే శ్వర్లు అక్కడిక్కడే మృతిచెందగా, మరో మోటారు సైకిల్‌పై వస్తున్న పాముర్తి నగేష్, యానాదలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కలువా యి ఎస్‌ఐ అయ్యప్ప సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు రాచూరి వెంకటేశ్వర్లు బేల్దారి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం కూడా పనికోసం పొదలకూరుకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. భార్య కువైట్‌లో ఉండగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సంఘటనా స్థలంలో గాయపడిన వారిని విచారిస్తున్న ఎస్‌ఐ అయ్యప్ప



మృతుడు రాచూరి వెంకటేశ్వర్లు (ఫైల్)

రైల్లోంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మనుబోలు, మే 15: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని కొండూరు సత్రం వద్ద బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి (28) రైల్లోంచి జారిపడి మృతిచెందాడు. 148వ కి.మీ వద్ద 1-3 స్తంభాల మధ్యలో విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న రైల్లోంచి ఓ వ్యక్తి పడిపోయి మృతిచెంది ఉండడాన్ని విధుల్లో ఉన్న కీమెన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమా చారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలు నమోదు చేసుకు న్నారు. మృతుడు నీలంరంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నా డు. చొక్కా లేదు. మిగతా వివరాలు లభించక పోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మృతదేహన్ని నెల్లూరుకు తరలించారు.

మందుబాబుల కష్టాలు తీరేనా!?

- మద్యం అమ్మకాలపై పరిమితులు ఎత్తివేత
- దుకాణాల్లోని సిబ్బంది చేతివాటం ఆగేనా!?

నెల్లూరు (క్రైం), మే 15 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది.. మద్యం అమ్మకాలపై ఉన్న నిబంధనలూ తొలగిపోయాయి. మరి ఇప్పటికైనా మందుబాబుల కష్టాలు తీరుతాయా!? లేదా!? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటినుంచి మద్యం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు మద్యం అమ్మకాలపై షరతులు విధించారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో దుకాణాలు, బార్లలో జరిగిన మద్యం అమ్మకాలు ఆధారంగా ఈసారి విక్రయాలు జరపాలంటూ నిబంధనలు విధించారు. ఈ పరిమితులు మద్యం దుకాణాల్లో సిబ్బందికి, బార్లకు, పలువురు స్థానిక నేతలకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఉదయం 11 గంటలకు తెరిచి సాయంత్రం 4-6 గంటల్లోపు మూసేసేవారు. దీనిపై మందు బాబులు ప్రశ్నించినా తమ కోటా విక్రయాలు అయిపోయాయంటూ సమాధానం ఇచ్చేవారు. అయితే, ఉదయం దుకాణాలు తీసిన తర్వాత గంటల వ్యవధిలోనే తమ కోటా అయిపోయిందంటూ సిబ్బంది చెప్పడం కొసమెరుపు. బార్లలో మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం లేదన్న మాటే లేకుండా జోరుగా అమ్మకాలు సాగించారు.



ఉదయగిరి రూరల్ : ఓ మద్యం దుకాణం వెనుక మందుబాబులు

- 23 మంది సిబ్బంది తొలగింపు

ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందు నుంచే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి భారీగా మద్యం బయటకు తరలుతోందని 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురిం చింది. ఆ వార్తలే నిజం అవుతూ పోలింగ్ అయ్యే నాటికే మద్యం దుకాణాల్లో అవకతవకలకు పాల్పడుతున్న 23 మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ప్రభుత్వ దుకాణంలోని మద్యంను బార్లకు, వైసీపీ నాయకులకు గుట్టుచప్పుడు కాకుండా తరలించడంతో మందుబాబులు ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో మద్యం అమ్మకాలపై ఉన్న నియంత్రణ తొలగించారు. దీంతో దుకాణాల్లో ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఇకనైనా సిబ్బంది చేతివాటం ప్రదర్శించకుండా మద్యం అమ్మకాలు సాగిస్తారా!? అన్నది వేచి చూడాలి.

ఓటెత్తిన జనం.. ఎవరికో పట్టం ?

● ఉదయగిరిలో 81.92 శాతం పోలింగ్ ● అత్యధికం జలదంకి - 85.95 ● అత్యల్పం సీతారామపురం - 76.80

ఉదయగిరి రూరల్, మే 15: ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 81.92 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో అత్యధికంగా జలదంకి మండలం 85.95 పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సీతారామపురం మండలంలో 76.80 శాతం నమోదైంది. నియోజవకర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,41,677 మంది ఓటర్లు ఉండగా 1,97,970 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వలస జీవుల కరుణ ఎవరిపైనో ?

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వలస జీవుల కరుణ ఈ ఎన్నికల్లో ఏ పార్టీపై పడిందోనని ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు అంచనాలు వేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, కలిగిరి, కొండాపురం మండలాల్లో సుమారు 40 శాతం మంది ప్రజలు ఇతర ప్రాంతాల్లో వివిధ వ్యాపారాలు, పనులు చేసుకొని జీవిస్తున్నారు. ఎన్నడూలేని విధంగా సార్వత్రిక ఎన్నికలకు 200 బస్సులు, 500 కార్లలో వలస ఓటర్లు భారీగా తరలివచ్చారు. 30-35 శాతం మంది ఓటు వేసేందుకు నియోజకవర్గానికి వచ్చారు. దీంతో ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తలు వలస ఓటర్ల చూపు తమవైపు అంటే తమవైపు అని అంచనాలు వేసుకొంటున్నారు. ఏదిఏమైనా గెలుపోటములు శాసించే వలస ఓటర్ల తీర్పు చూడాలంటే వచ్చేనెల 4వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే.

మండలం	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	ఓటింగ్ నమోదు శాతం 2019	ఓటింగ్ నమోదు శాతం 2024
సీతారామపురం	19,160	14,715	75.96	76.80
ఉదయగిరి	30,264	24,238	78.0	80.09
దుత్తలూరు	22,591	18,152	72.6	80.35
వరికుంటపాడు	25,925	22,177	70.0	85.54
వింజమూరు	33,369	26,093	77.0	78.20
కలిగిరి	37,963	31,637	84.36	83.34
కొండాపురం	34,591	28,455	75.8	82.26
జలదంకి	37,814	32,503	81.0	85.95
మొత్తం:	2,41,677	1,97,970	78.68	81.92

ముగిసిన ఎన్నికలు.. మూగబోయిన పల్లెలు !



ఉదయగిరిలో బోసిబోయిన వీధులు

ఉదయగిరి, మే 15: అసెంబ్లీ ఎన్నికల్లో చివరి ఘట్టమైన పోలింగ్ ముగియడంతో గ్రామాలు మూగబోయాయి. ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు ప్రచార రథాల పాటలతో నాయకుల ఉపన్యాసాలతో, వచ్చిపోయే అతిథులతో గ్రామాలు సందడిగా ఉండేవి. ఓటర్ల చుట్టూ తిరుగుతూ తమ పార్టీకే ఓటు వేయాలని ఇంటింటికి తిరిగిన నాయకుల సందడి లేక పోవడంతో గ్రామాల్లో వీధులు వెలవెల బోతున్నాయి. మే 13న ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో ఎక్కడ వారు అక్కడే గప్‌చుప్‌గా ఉండిపోయారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితలు బయటపడిన తర్వాత గ్రామాల్లో నెలకొన్న మరికొంత ఉత్కంఠకు తెరపడనుంది.

వ్యక్తిగత పనులపై దృష్టి: తమ పార్టీ అభ్యర్థి గెలవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు సొంత పనులను సైతం పక్కనబెట్టి రెండు, మూడు నెలలపాటు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. వారి పార్టీ గెలిస్తే వారే గెలిచినట్లుగా భావించి ప్రతి ఇంటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఒక చేతిలో పార్టీ జెండా మరో చేతిలో ఓటర్ లిస్టు పట్టుకుని గల్లీగల్లీ తిరిగి ఎంతో శ్రమపడ్డారు. ఓట్ల పండుగ ముగియడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇక వారి వ్యక్తిగత పనులపై దృష్టిపెట్టారు. వ్యవసాయం చేసుకునే రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులు సైతం వారి పనుల్లో నిమగ్నమయ్యారు. పార్టీ కోసం, అభ్యర్థి కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు వారి కష్టానికి ఫలితం దక్కాలని ఆశిస్తున్నారు.

ఎవరి ఖర్చులు వారివే: ప్రధాన పార్టీల అభ్యర్థుల కోసం ప్రచారాలు చేసిన నాయకులు, కార్యకర్తలు ఇక నుంచి ఎవరి ఖర్చులు వారే పెట్టుకుని గ్రామాల్లో చలామణి అవ్వాలి. ఇన్ని రోజులపాటు పోటీ చేస్తున్న అభ్యర్థులు రోజువారీగా డబ్బులు పంపించారు. కానీ ఎన్నికలు పూర్తి కావడంతో ఏది తాగాలన్నా ఏమి తినాలన్నా ఎటు వెళ్లాలన్నా వారి వ్యక్తిగతంగా ఖర్చులు పెట్టుకోవాలి. రెండు నెలలపాటు ప్రతి రోజు అభ్యర్థులు ఇచ్చిన డబ్బులతో గ్రామాల్లో తిరిగిన వారు నేడు వారి జేబుల్లో నుంచే పెట్టుకోక తప్పడం లేదు. రెండునెలల పాటు ఏదో పార్టీ మీటింగ్‌కు ప్రచారానికి వెళుతూ రోజు కు 200 నుంచి 500 రూపాయల వరకు సంపాదించుకుంటూ భోజనం సైతం దొరి కింది. దీనికితోడుగా వారి పిల్లలను కుటుంబ సభ్యులను సైతం తీసుకెళ్లి ఓ గంట తిరిగి డబ్బులు తెచ్చుకున్నారు. కానీ ఇప్పుడు ఉదయం వెళ్లి సాయంత్రం వరకు పనిచేసి డబ్బులు సంపాదించక తప్పదు.

పార్టీలకతీతంగా కార్యకర్తల చర్చలు: రెండు నెలలపాటు నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం నిర్వహిస్తూ వారి పార్టీ అభ్యర్థి కోసం కొట్లాటలకు సైతం దిగిన కార్యకర్తలు నేడు వారి గ్రామాల్లో పార్టీలకు అతీతంగా చర్చల్లో మునిగిపోయారు. పలు పత్రికల్లో వచ్చిన కథనాలు, ఎన్నికల పోల్స్ చెబుతున్న ఫలితాలపై రాష్ట్ర రాజకీయాలు ఎలా ఉంటాయో అంటూ చర్చించుకుంటున్నారు. ఎన్నికల స్టంట్ ఉండడంతో వారి బలాబలాలు చూపించేందుకు అభ్యర్థి మెప్పుపొందేందుకు చేసిన రాజకీయం ఓ భాగమని చాటిచెప్తున్నారు. ఇప్పుడు హోటళ్లు, కల్లు, మద్యం షాపుల వద్ద గ్రామాలు, కూడళ్లల్లో అన్ని పార్టీల కార్యకర్తలు కలిసి ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడతారో లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరు గెలిచినా, ఓడినా మనమంతా కలిసి ఉండాల్సిన అవసరముందని,పార్టీలు వేరైనా ఐక్యమత్యాన్ని చాటాలని మాట్లాడుకుంటున్నారు.

సీతారాముల ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్, మే 15: మండలంలోని శకునాలపల్లిలో బుధవారం శ్రీ సీతారాముల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామివార్లకు గణపతి, పుణ్యహ వచనం, నవగ్రహ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామం, పరిసర గ్రామాల భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధన్వంతరి ఆరోగ్య పీఠం అధ్యక్షుడి మృతి

ఉదయగిరి రూరల్, మే 15: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు, ధన్వంతరి పీఠం అధ్యక్షుడు వీఎల్ నారాయణరావు గుండెపోటుతో బుధవారం చిత్తూరు జిల్లా కలికిరిలో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం బుచ్చిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు

మర్రిపాడు, మే 15: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు ఆశాజనకంగా ఉన్నాయి. బుధవారం బోర్డుకు రైతులు 963బేళ్లను తీసుకొని రాగా, 18కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 910బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 53 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ. 299 కాగా కనిష్ఠ ధర రూ. 205 పలకగా సగటున ధర రూ. 275.55గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ స్తంభాలు మార్చండి

ఉదయగిరి, మే 15: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి బీసీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ ఏర్పడినప్పుడు విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటు చేసిన స్తంభాలు పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదానికి చేరువలో ఉన్నాయన్నారు. బలమైన గాలులు వీచినా, వర్షాలు కురిసినా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోపాటు కూలే దశలో ఉన్నాయని, పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని స్తంభాలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాకర్ల సురేష్‌కు అభినందనల వెల్లువ



టీడీపీ కార్యాలయంలో నాయకులతో కాకర్ల సురేష్

వింజమూరు, మే 15: ఉదయగిరి నియోజక వర్గం లోని 8 మండలాల నుంచి టీడీపీ నాయకులు వింజ మూరు పంచాయతీ పరిధి లోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగు దేశం పార్టీ కార్యాల యానికి చేరుకుని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌కు అభినందనలు తెలి యజేస్తున్నారు. ఉదయగిరి కోటపై దాదాపు 25వేల మెజారిటీతో తెలుగుదేశం జెండా ఎగరబోతుందని భరోసా కల్పిస్తున్నారు. 8 మండలాల్లో ఉదయగిరి మినహాయించి అన్ని మండలాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరిలో కూడా స్వల్ప మెజారిటీ వైసీపీకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషణ చేస్తున్నారు. పార్టీ కార్యాలయంలో నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో కాకర్ల సురేష్‌ని ఘనంగా సన్మానిస్తున్నారు. జూన్ 4వ తేదీ సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. 120 సీట్లు పైబడి తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేయనున్నట్లు తెలిపారు. కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని, ఉదయగిరిని సిరుల గిరిగా చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు ఉన్నారు.

సాధారణ విధులకు అధికార యంత్రాంగం సన్నద్ధం

ఆత్మకూరు : ఎన్నికల బాధ్యతల నుంచి విముక్తి లభించడంతో సాధారణ విధులకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. దాదాపు ఒకటిన్నర నెలపాటు ఆత్మకూరు నియోజకవర్గంలో సమస్యలకు సంబంధించిన వందలాది అర్జీలు పేరుకుపోయాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైల్స్ దుమ్ముకొట్టుకుపోయాయి. మండల, మున్సిపల్ సమీక్ష సమావేశాలకు బ్రేక్ పడ్డాయి. ప్రతి సోమవారం ఎంతో హంగామా, హడావిడిగా కనిపించే ప్రభుత్వ కార్యాలయాలు ఈ రెండు నెలలు బోసిపోయాయి. గత 40 రోజులకు పైగా సమస్యల పేరుతో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగినా ఇప్పుడు కాదంటూ వారిని వెనక్కి సాగనంపారు. ఎన్నికల విధుల నుంచి విముక్తి లభించడంతో అధికార యంత్రాంగం సాధారణ విధుల్లో నిమగ్నమైంది.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఉదయగిరి, మే 15 : గ్రామాల్లో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో విచ్చల విడిగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మేజర్ పంచాయతీ ఉదయగిరితోపాటు గండిపాలెం, అప్పసముద్రం, బిజ్జం పల్లి, గన్నేపల్లి, అయ్యవారిపల్లి, కృష్ణం పల్లి, కుర్రపల్లి, శకునాలపల్లి, దాసరిపల్లి తదితర పంచాయతీల్లో కుక్కల బెడదకు ప్రజలు వణికి పోతున్నారు. పగలు రాత్రి సమయాల్లో బయటికి రాలేని పరిస్థితులున్నాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ముఖ్యంగా పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు : మల్లికార్జున ఈవోపీఆర్డీ

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.. ఇదివరకే ఉదయగిరి మేజర్ పంచాయతీలో కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకుని, పిచ్చికుక్కలపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కుక్కలను పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కంపచెట్ల మధ్య వసతిగృహం

● విద్యార్థుల అవస్థలు



కంపచెట్ల మధ్య ఉన్న వసతిగృహం

ఆత్మకూరు : మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ సమీకృత గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో మౌలిక వసతులు కొరవడడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వసతి గృహంలో ఈ ఏడాది 3 నుంచి 10వ తరగతి వరకు చదివే 70 మంది విద్యార్థులు ఉన్నారు. వసతిగృహానికి ప్రహరీగోడ లేక రక్షణ కరువైంది. వసతిగృహం పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండడంతో విషపురుగుల బెడద విద్యార్థులను కలవరపరుస్తోంది. దానికితోడు వసతిగృహం ఎదుట పెద్దగోతులలో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా ఉన్నాయి. విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఈ వసతిగృహం పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీయాల్సి పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహ సముదాయానికి ప్రహరీగోడ నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాలను చదును చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



అయ్యవారిపల్లె చెరువులో నీటి కోసం వెంపర్లాడుతున్న మూగజీవాలు

వలేటివారిపాలెం, మే 15 : మండలంలోని అయ్యవారిపల్లె, మాలకొండ, రామలింగాపురం, పోలినేనిచెరువు, గరుకపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, చుండి, కాకర్లవారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లో నీరు లేక మూగజీవాలు అలమటిస్తున్నాయి. పల్లెలో పశువుల దాహర్తి తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయంలో లక్షలు వెచ్చించి నీటి తొట్టెలు నిర్మించారు. నేడు అవి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ సక్రమంగా లేక కొన్ని శిథిలావస్థకు చేరగా, మరికొన్ని చెత్తకుండీలను తలపిస్తున్నాయి. మండలంలో 14,692 గేదెలు, 460 ఆవులు, 25,738 గొర్రెలు, 7,063 మేకలు ఉన్నాయి. వర్షాభావంతో వాగులు, వంకలు, చెరువుల్లో చుక్కనీరు లేదు. నీటి వసతి కల్పించని అధికారుల తీరుపై పశు పోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న నీటి తొట్టెలకు మరమ్మతులు చేసి వాటిలో నీటి సౌకర్యం కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

కుంగిన జాతీయ రహదారి

కలిగిరి, మే 15: కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కావలి- కలిగిరి మధ్య పలు చోట్ల బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారు. అయితే జలదంకి నుంచి కలిగిరి మధ్యలో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కావడంతోపాటు రహదారి పనులు దాదాపుగా కావచ్చాయి. అయితే బ్రిడ్జి నిర్మాణాలు అనంతరం ఆయా ప్రాంతాలవద్ద అడుగుభాగం నుంచి మట్టి లేయర్లు నాసిరకంగా వేయడంతో రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. రహదారి పూర్తయిందని వాహనదారులు వేగంగా వచ్చే క్రమంలో బ్రిడ్జిల వద్ద కుంగిన రహదారి విషయం గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు కుంగిన బ్రిడ్జిలవద్ద మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్డుపనులు నాణ్యతగా చేయాలని వారు కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మాణం వద్ద కుంగిన రోడ్డుకు మరమ్మతులు

పేకాట ఘర్షణలో వ్యక్తికి గాయాలు

కందుకూరు, మే 15 : పేకాట ఆడుతూ ఇద్దరి మధ్య రేగిన వివాదం కత్తిపోట్లకు దారితీసింది.కందుకూరులోని శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.అదే కాలనీకి చెందిన ఇరువురు పేకాట ఆడుతుండగా వివాదం జరిగింది.డబ్బులు విషయంలో గొడవ జరిగి ఎద్దు శివపై మరో వ్యక్తి కోడి కత్తితో దాడి చేశాడు.శివకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా హాస్పటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తీసుకువెళ్లారు.ఇరువురు కూడా ఎన్నికల కోసం హైదరాబాద్ నుంచి కందుకూరుకు వచ్చినట్టు తెలిసింది.

నేడు గుడ్లూరు మండల సమావేశం

గుడ్లూరు, మే 15 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల అధికారులతోపాటు ప్రజాప్రతి నిధులు హాజరుకావాలని తెలిపారు.

గెలుపుపై ఇరుపార్టీల ధీమా

లింగసముద్రం, మే 15 : జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో మెజారిటీ తమకంటే తమకంటూ వైసీపీ, టీడీపీలు భావిస్తున్నాయి. మండలంలోని 30,953 ఓట్లకుగాను 28,015 ఓట్లు పోలయ్యాయి. భారీగా యువత, మహిళలు, ఇతర నగరాల నుంచి సాఫ్టవేర్ ఇంజనీర్లు కూడా ఓటింగ్‌కు తరలి వచ్చారు.దీంతో తమకే మెజారిటీ వస్తుందంటూ టీడీపీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద ఈ ఎన్నికల్లో మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో చూడాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే.

నేడు ఉచితంగా ఒడుగులు

చిత్రగుంట, మే 15: బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని ఎంకే ఫంక్షన్ హాల్లో గురువారం బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఒడుగుల కార్యక్రమం నిర్వహించ నున్నట్లు జిల్లా ముస్లిం మైనార్టీ నేత షేక్ సమీఉల్లా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలోని పేదముస్లింల పిల్లలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు గురువారం ఉదయం 8 గంటలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తహార్ మహమ్మద్ హుస్సేన్, ఖాదర్‌బాషా, ఖలీల్, బడీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

433 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 455 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14కంపెనీ ప్రతినిధులు పాల్గొని 433బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-2, ఆర్‌ఆర్-3, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 22బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.270.08గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

అల్లూరు, మే 15 : అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడిన వారికి వెంటనే గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా... ప్రజలు టీడీపీని ఆదరించారు : కావ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మే15: వైసీపీ నాయకులు పోలింగ్ రోజు ఎన్ని హింసలు పెట్టినా, ఎన్ని కుయుక్తులు పన్నినా ఓటర్లు టీడీపీని ఆదరించారని కావలి టీడీపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ సరళి టీడీపీకి అనుకూలంగా ఉందని, పోలింగ్ కేంద్రాల వద్ద అలజడులు సృష్టించి ఓటర్లను భయపెట్టేందుకు వైసీపీ కుయుక్తులు పన్నిందన్నారు. ఇందులో భాగంగానే అల్లూరు మండలం బీరంగుంట, అల్లూరు రామకృష్ణకళాశాల, కావలి రూరల్ మండలం ముసునూరులో అలజడులు సృష్టించి దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడుల్లో బీరంగుంటకు చెందిన శ్రీనివాసులు గాయపడ్డారన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అరాచకపాలన నుంచి విముక్తి పొందాలని ఓటర్లు చైతన్య వంతులై కసిగా ఓట్లు వేసి టీడీపీని ఆదరించారని చెప్పారు. తమ విజయం పోలింగ్ రోజే ఖాయమైందని, జూన్‌లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్, టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, మన్నవ రవిచంద్ర, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, అబ్దుల్ రహీం, దేవకుమార్, షేక్ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి 61వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రవికుమార్

కావలిటౌన్; మే15: కావలి ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవికుమార్ బుధవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో 61వ సారి రక్తదానం చేశారు. రక్తదాన ప్రేరణలో భాగంగా ప్రతి ఏడాదిలో రెండు,మూడు సార్లు రక్తదానం చేయడంతోపాటు రక్తదాన ఆవశ్యకతను ఆయన ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ (పర్సనల్) గంగు విజయకుమారి, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, కావలిశాఖ రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు తదితరులు అభినందించారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం



అడవిలో ఏర్పాటుచేసిన గుంటలో నీరు తాగుతున్న మూగజీవాలు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండాపురం, మే15: మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలో ఉన్న సామాజిక అడవిలో వన్యప్రాణులకు నీటివసతి లేక జింకలు మరణించాయి. దీంతో గతనెల 30 వతేదీన ఆంధ్రజ్యోతిలో 'వన్యప్రాణుల దాహార్తిని తీర్చండి' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కృత్రిమంగా ప్రత్యేక నీటి గుంటను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ బాషా మాట్లాడుతూ అడవిలో ప్రత్యేకంగా గుంటను ఏర్పాటుచేసి నీటిని నింపామన్నారు. పంచాయతీ సర్పంచి పర్యవేక్షణలో ఈగుంటలో నీటిని ప్రతి రోజూ పరిశీలించి, అయిపోయిన వెంటనే ట్రాక్టరు ట్యాంకుతో మళ్లీ నింపుతారని తెలిపారు.

గిరిజనులకు పొంచి ఉన్న ముప్పు

● విష పురుగులకు నిలయంగా అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
● మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు

కావలి రూరల్, మే 15 : పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని అట్టల ఫ్యాక్టరీ వ్యర్థాలతో తమకు ప్రమాదం పొంచి ఉందని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. ఫ్యాక్టరీలోని వ్యర్థాలను రోడ్డుపై వేయడంతో అవి పెద్దకుప్పగా మారాయి. దీంతో చిన్నపాటి గాలి వీచినా వ్యర్థాలు మొత్తం సమీపంలో ఉన్న గిరిజన కాలనీలోని ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో ఇళ్లలోని నీరు కూడా కలుషితమౌతున్నదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి విషసర్పాల నిలయంగా మారాయి. నిత్యం ఏదో ఒక ఇంట్లో పాములు చేరటంతో ఆ ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని గిరిజనులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు అక్కడకు వచ్చి నానా హంగామా చేసి మామూళ్లు దండుకుని పోతున్నారే తప్ప.. రోడ్డు పై వేసిన చెత్తకుప్పలను తొలగించలేక పోతున్నారని గిరిజనులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న చెత్తను తొలగించి, విషసర్పాల నుంచి తమను కాపాడాలని వారు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు.



విష పురుగులకు నిలయంగా అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు



అట్టల ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై చేరిన వ్యర్థాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కందుకూరు, మే 15 : పట్టణంలోని మహదేవపురం అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ ఎస్‌ఐ ఆనంద్ భాస్కర్ కథనం మేరకు, కే కిషోర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై శ్రీనివాస కాలనీకి వెళ్లేందుకు మహదేవపురం అడ్డరోడ్డు వద్ద రోడ్డు మలుపు తిరిగే క్రమంలో సింగరాయకొండ నుంచి కందుకూరుకు వస్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన కిషోర్‌ని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వసతులు లేకపోవడంతో ఒంగోలులోని ప్రైవేటు హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. పాలవ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.



చిట్టేపల్లి తిప్ప వద్ద ఆగి వున్న ట్యాంకర్లు, ప్లాంట్

నిర్వహణ లోపం..
మూతపడిన శుద్ధిజలం ప్లాంట్లు

- తాగునీటి కోసం ప్రజల అవస్థలు

పొదలకూరు, మే 15: మండలంలోని 30 పంచాయతీల ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని వైసీపీ గాలికొదిలేసింది. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బయట కొనుక్కునే ఆర్థిక స్థోమత లేక స్థానికంగా లభించే నీటి వనరులనే వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. పొదలకూరు మేజర్ పంచాయతీ చిట్టేపల్లి తిప్ప వద్ద గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గత ప్రభుత్వం 2019లో రూ.4కోట్లు వెచ్చించి పథకాన్ని ప్రారంభించారు. నీటి సరఫరా నిమిత్తం కొత్త ట్రాక్టర్లు సైతం కొనుగోలు చేశారు. ఇప్పటికి నాలుగేళ్లుగా పథకం, ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ వేసవికైనా శుద్ధజలం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- దోమల బాధతో ప్రజల ఇక్కట్లు

ఇందుకూరుపేట, మే 15 : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. నిధుల కొరత కారణంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి, దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దోమలు దండెత్తి పల్లెవాసులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో నిధుల లేమి కారణంగా పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికను తొలగించడం లేదు. ఇటీవల ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెబుతున్న పాలకులు.. గ్రామాల్లో పారిశుధ్యంపై మాత్రం దృష్టి పెట్టడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. చాలా గ్రామాల్లో నివాసాల చెంత మురుగు నీరు నిలిచి ముందుకు కదలడంలేదు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు.



జగదేవిపేటలో ఇళ్ల మధ్యలోనే చెత్తకుప్పలు

- 'అంబేడ్కర్ స్టడీ సర్కిల్' పనులకు దశాబ్ద కాలం
- మహాత్మా జ్యోతిబా పూలే భవనానికి ఐదేళ్లు
- చిట్టడవిని తలపించేలా పెరిగిన చిల్లచెట్లు
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం



అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనం పునాదుల్లో పెరిగిన చెట్లు

భవనాల నిర్మాణం
పునాదులకే పరిమితం!

నెల్లూరు(వీఆర్సీ), మే 15 : జిల్లా కేంద్రంలో మహనీయుల పేర్లతో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్, మహాత్మజ్యోతిబాపూలే భవనాల నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. ఆ ప్రాంతాల్లో చిల్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోన్నాయి. ఈ భవనాల నిర్మాణాన్ని ఎప్పుడు చేపడతారని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దశాబ్ద కాలం క్రితం సుమారు రూ.5.50 కోట్లతో నగరంలోని కొండాయపాలెం గేటు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం పునాదుల దశ దాటలేదు. ఐదేళ్ల క్రితం పునాదులు వేసిన మహాత్మజ్యోతిబాపూలే (బీసీ) భవనం నిర్మాణం పరిస్థితి అంతే. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ భవనాల పనులు నిలిపి వేసింది. ఆ తర్వాతనైనా పనులు ప్రారంభించారా అంటే అదీ లేదు. అప్పటి వరకు పనులు చేపట్టిన గుత్తేదారు బిల్లులు రాక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పునాదులు వరకు చేపట్టిన పనులు అలాగే ఆగిపోవడంతో భవన్ నిర్మించ తలపెట్టిన స్థలం చిట్టడవిలా తయారైంది. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి డంపింగ్ యార్డులా మారింది. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అనే పదం ప్రతి సమావేశంలో ఉచ్చరించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలకు గతంలో ఉన్న 25 పథకాలను రద్దు చేసిన ఘటనపై దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నా.. తమకు దైవ సమానులుగా భావించే అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనాలు పునాదుల్లో ఆగిపోవడంతో దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పునాదుల దశ దాటని మహాత్మజ్యోతిబా పూలే భవనం

- సామాజిక పరివర్తకుడు మహాత్మజ్యోతిబా పూలే భవన నిర్మాణంలో కూడా అదే జాప్యం జరుగుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బీసీ సంక్షేమ భవనానికి ఆట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారంలోనికి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గతంలో చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఆనవాళ్లు లేకుండా చేసి హడావిడిగా మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. బీసీల కంటి తుడుపు చర్యగా కొద్దిపాటి పనులు చేసి అలా అర్థాంతరంగా పనులు నిలిపి వేశారు. ఇక నాటి నుంచి నేటి వరకు ఒక్క ఇటుక రాయి కూడా పెట్టిన పాపానపోలేదు. దేశంలోనే ఇంతటి పేరున్న మహనీయుల పేరుతో నిర్మించనున్న ఈ భవనాలకు మోక్షమెప్పుడు వస్తుందోనని పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'సింహపురి' ప్రతిభ



స్కూల్ ఫస్ట్ వచ్చిన వారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు, మే 15 : టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో సింహపురి ఇంటర్నేషనల్ స్కూల్ ఉత్తమ ప్రతిభతో మంచి ఫలితాలు సాధించినట్లు స్కూల్ చైర్మన్ దగ్గు శివకుమార్ తెలిపారు. మండలంలోని పేడూరు రోడ్డులో ఉన్న పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సీబీఎస్ఈ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని, తమ పాఠశాలకు చెందిన ఎస్ శ్రీవర్ధిని 433, ఆర్ నిర్మల జెస్సీ 415, డి ఉమేష్‌సాయి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో పదో తరగతి మొదటి బ్యాచ్ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజిత, ప్రిన్సిపాల్ రాణిమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో స్థానిక సంస్థలకు
నిధుల్లేవు.. గౌరవం లేదు

- జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు అందని వేతనాలు
- 17 నెలలుగా ఎదురుచూపులు

పొదలకూరు, మే 15 : స్థానిక సంస్థలను జగన్ ప్రభుత్వం నిస్తేజంగా మార్చింది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సొంతానికి వాడేసుకుంది. విద్యుత్ చార్జీలు, ఇతరత్రా బకాయిలు కోసం నిధులను మళ్లించడంతో అభివృద్ధి పనులు చేసే అవకాశం లేకుండా పోవడంతో ప్రజాప్రతినిధులంతా ఈ ఐదేళ్లపాటు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. చివరకు వారికి గౌరవం లేకుండా చేసింది. నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు సకాలంలో అందలేదు. జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు 2022 నవంబరు నుంచి వేతనాల్లేవు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎంపీటీసీలు -544, జడ్పీటీసీలు 46 మంది ఉన్నారు. వైసీపీ వచ్చాక పంచాయతీ ప్రధాన పౌరులైన సర్పంచులు చిన్నచూపునకు గురయ్యారు. 50 మంది కుటుంబాలకు నియమించిన ఒక వాలంటీరుకు నెలకు రూ.5వేలు వేతనమిస్తే, గ్రామ పెద్ద సర్పంచ్‌కు మాత్రం ఇచ్చేది రూ.3వేలే. ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ఎన్నికైన వారిలో పేదలే ఎక్కువ మంది. ఓవైపు ప్రభుత్వ పనులు లేకపోవడం, ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు కావడం, గౌరవ వేతనం రాక ఇబ్బంది పడుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్టోబరు నుంచి డిసెంబరు త్రైమాసికానికి జనవరిలో, జనవరి నుంచి మార్చి వరకు ఏప్రిల్‌లో చెల్లించారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించేవారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సాధారణ నిధులు చెల్లించి, తర్వాత సర్దుబాటు చేసేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. సాధారణ నిధులు ఏమూలకూ చాలకపోవడంతో ప్రభుత్వం ఇస్తే తప్ప చెల్లింపులు సాధ్యం కాలేదు. నెలకు జిల్లా పరిషత్తు చైర్మన్‌కు రూ.40వేలు, జడ్పీటీసీ రూ.6వేలు, ఎంపీపీ రూ.6వేలు, ఎంపీటీసీలకు రూ.3వేలు చొప్పున ఇవ్వాలి. ఎంపీపీ, ఎంపీటీసీలకు మండల పరిషత్‌లు ఇవ్వాలి. వాటికి జడ్పీ నుంచి వస్తాయి. అయితే కొన్ని నెలలుగా ఆ ప్రక్రియ ఆగిపోయింది. చెల్లింపులు సాధ్యం కాలేదు. ఎంపీపీ, ఎంపీటీసీలకు మండల పరిషత్‌లు ఇవ్వాలి. వాటికి జడ్పీ నుంచి వస్తాయి. అయితే కొన్ని నెలలుగా ఆ ప్రక్రియ ఆగిపోయింది.

మండుతున్న ఎండలు

- బెంబేలెత్తుతున్న జనం

వెంకటాచలం, మే 15: గత మూడు రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం నుండే ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు ఉక్కపోత కారణంగా బయట తిరగాలంటే హడలి పోతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఈవిధంగా ఉంటే మే నెల చివరలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలు ఇదే విధంగా కొనసాగితే భూగర్భ జలాలు కూడా అడుగంటి పోయి తాగు నీటికి కూడా ప్రజలు అల్లాడే పరిస్థితి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు.

వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న విజయను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

వెంకటాచలం, మే 15 : విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సీహెచ్ విజయ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భం గా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేషన్ సభ్యులు ఆమెను కలిసి అభినం దనలు తెలిపి ఘనంగా సత్క రించారు. అనంతరం నూతన ప్రిన్సిపాల్ విజయ మాట్లాడుతూ యూనివర్సిటీ వీసీ సుందరవల్లి ఆధ్వర్యంలో సాధించుకున్న న్యాక్ ఏగ్రేడ్‌ను దృష్టిలో ఉంచుకొని అందరం సమిష్టిగా పనిచేసి భవిష్యత్తులో యూనివర్సిటీకి మంచి పేరు తీసుకుని వస్తానన్నారు. వర్సిటీ కళాశాల అభ్యున్నతికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

అల్లూరు, మే 15 : అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడిన వారికి వెంటనే గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నారాయణకు బాలయ్య సేన సన్మానం



నారాయణను సన్మానిస్తున్న బాలయ్య సేన నాయకులు

నెల్లూరు(వైద్యం), మే 15 : మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణను బాలయ్య సేన నేతలు బుధవారం నగరంలోని నారాయణ నివాసంలో కలిసి సన్మానించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య పటాన్ని బహూకరించారు. అలాగే కిరీటధారణ చేసి పుష్పగుచ్ఛం అదజేశారు. నారాయణ ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహర్నిశలు శ్రమించి తన గెలుపు కోసం కృషి చేసిన బాలయ్య సేన నేతలను నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య సేన జిల్లా కన్వీనర్ వై.రవి, శ్రీధర్‌రెడ్డి, కేసీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సల సంఖ్య పెంచండి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్



మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు(వైద్యం), మే 15 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సర్జరీ విభాగంలో శస్త్ర చికిత్సలు పెంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ సూచించారు. బుధవారం జీజీహెచ్‌లోని సర్జరీ విభాగంలో హెచ్‌వోడీ, వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనరల్ సర్జరీ విభాగంలో రిస్క్ కేసులు ఎట్టి పరిస్థితిలో బయటకు పంపవద్దన్నారు. రిస్క్ కేసులు ఛాలెంజీగా తీసుకుని వైద్య చికిత్స అందించాలని తెలిపారు. ఆపరేషన్ తర్వాత రోగులు తగిన జాగ్రత్తలు తీసుకునేలా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేస్తే ఆసుపత్రికి నిధులు వస్తాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ సేవలు పెంచాలని ఆదేశించారు. అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ కాలేషాబాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి



రాజరాజేశ్వరిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), మే 15 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీరాజరాజేశ్వరి అలంకారం వైభవగా జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మూలవరులకు విశేష పుష్పాలంకారం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ధర్మకర్త లు, ఉభయ కర్తలు పర్యవేక్షించారు.

రేపు వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కందుకూరి చెంగయ్యాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, కలిశ తీర్థం, అభిషేకాలు, పుష్పాలంకారం, హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ, రాత్రి 7 గంటలకు భరతనాట్య ప్రదర్శన, 8 గంటలకు కోలాటం ప్రదర్శనలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

హరిహరమూర్తి అలంకారం



హరిహరమూర్తి అలంకారంలో మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు బుధవారం 4వ రోజుకి చేరాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష పూజలు, పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం హరిహర మూర్తి అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రాకార ఉత్సవం, తోటల్లో స్వామివారిని వేంపు చేసి, కుంభహారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

జేఎస్ రెడ్డికి వెంకయ్యనాయుడు నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : బెంగళూరులో బుధవారం నిర్వహించిన జేఎస్ రెడ్డి ఉత్తరక్రియల్లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయడు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేఎస్ రెడ్డి తనకు మిత్రుడు అని, ఆయన లేని లోటు ఆయన కుటుంబం, ఆయన సంస్థలకే కాదు సమాజానికి తీరనిలోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

433 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధ వారం రైతులు మొత్తం 455 పొగాకు బే ళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14కంపెనీ ప్రతినిధులు పాల్గొని 433 బేళ్లు కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.270.08గా నమోదైంది.

మదర్ కేర్‌పై అవగాహన

నెల్లూరు(వైద్యం), మే 15 : నగరంలోని రిచ్ ఆసుపత్రిలో ఇంటర్ నేషనల్ కాంగారూ మదర్ కేర్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ తల్లులు చేతులు, ఛాతిని శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లి చర్మం తాకిడితో బిడ్డకు తగినంత వెచ్చదనం వస్తుందని చెప్పారు. ఇది బిడ్డ త్వరగా పెరగటానికి, ఏడుపు తగ్గుతుందని, దీన్నే కాంగారు కేర్ అంటారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవ్యశ్రీ, హరీషా, అమృత, సీఈవో డాక్టర్ భాస్కర్, జీఎం ఆనంద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఎక్కడో అమరావతి, ఢిల్లీల్లో కూర్చున్న ఎన్నికల కమిషన్ అధికారులకున్న ముందు చూపు కూడా స్థానికంగా వున్న అధికారులకు లేకపోయిందన్న అపవాదును జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం ఎదుర్కొంటున్నాయి. దాన్ని నిజం చేస్తూ పోలింగ్ రోజు, తర్వాత రోజు ఘటనలను అంచనా వేయడంలోనూ, ముందస్తు చర్యలు తీసుకోవడంలోనూ ప్రత్యేకించి పోలీసు యంత్రాంగం విఫలమైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలో సంభవించిన రాజకీయ హింసాత్మక ఘటనల వెనుక ప్రధానంగా పోలీసు యంత్రాంగం వైఫల్యమే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


ఈవీఎంల స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేసిన మహిళా వర్సిటీ వద్ద మంగళవారం సాయంత్రం గంటలకొద్దీ కొనసాగిన ఉద్రిక్త వాతావరణం

సున్నిత ప్రాంతాలపై కొరవడిన నిఘా

పోలీసు వైఫల్యంతోనే హింసాత్మక ఘటనలు!

ముందస్తు అంచనాలు, జాగ్రత్తల్లో నిర్లక్ష్యం

ఘర్షణలు జరిగాకైనా మేలుకోని వైనం

144 సెక్షన్ పొడిగించాల్సింది ఎపుడు?

పోలింగ్‌ను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం నుంచీ పోలింగ్ రోజు సాయంత్రం వరకూ సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధిస్తున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ 11వ తేదీ ప్రకటించారు. అయితే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలు పోలింగ్ రోజే జరిగాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా కనీసం చంద్రగిరి నియోజకవర్గంలోనూ, దానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములున్న మహిళా వర్సిటీ ప్రాంతంలోనూ 144 సెక్షన్ అమలును పొడిగించి వుండాల్సింది. అధికారులు ఆ జాగ్రత్త కూడా పాటించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. జరగాల్సిందంతా జరిగాక ఆలస్యంగా మేలుకొని మంగళవారం సాయంత్రం పొడిగిస్తున్నట్టు ప్రకటించారు.

స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు ఏం చేస్తున్నట్టు?

జిల్లాలో పోలీసు శాఖకు అనుబంధంగా స్పెషల్ బ్రాంచి పనిచేస్తుంది. ఈ విభాగం ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఘర్షణాత్మక పరిస్థితులున్నపుడు ప్రధాన పార్టీల నేతల కదలికలను, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ఎస్పీని హెచ్చరించాలి. కానీ అలాంటిదేమీ నాలుగు ఘటనల్లో జరగలేదు. స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్స్ విభాగంతో కూడా జిల్లా ఎస్పీ సమన్వయంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవాల్సి వుంటుంది. ఆ విభాగం పనితీరు కూడా ఈ సందర్భంగా ప్రశ్నార్థకమవుతోంది.

ఈసీకి వున్న ముందు చూపు జిల్లా యంత్రాంగానికేదీ?

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో పరిస్థితులు సజావుగా లేవని ఎన్నికల కమిషన్ ఎప్పుడో గ్రహించింది. దానికి తగ్గట్టుగా అనేక చర్యలు తీసుకుంది. అందులో భాగమే వంద శాతం వెబ్ కాస్టింగ్. అలాగే కేంద్ర బలగాల మొహరింపు. వాస్తవానికి జిల్లా యంత్రాంగం చంద్రగిరిలోని 397 పోలింగ్ కేంద్రాల్లో 202 సమస్యాత్మకమని, 15 తీవ్ర సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. అలాగే తిరుపతిలో 274 పోలింగ్ కేంద్రాలకు గానూ 86 సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. శాంతిభద్రతల పర్యవేక్షణకు వచ్చిన కేంద్ర పరిశీలకుడు ఈ రెండు నియోజకవర్గాలపై వచ్చిన ఫిర్యాదులను, ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని వంద శాతం వెబ్ కాస్టింగ్‌తో పాటు కేంద్ర బలగాల నియామకానికి సిఫారసు చేశారు. ఈసీ సైతం దాన్ని ఆమోదించింది. ఈ నిర్ణయం వెనుకున్న స్ఫూర్తిని జిల్లా యంత్రాంగం యధాతధంగా స్వీకరించలేదన్న ఆరోపణలున్నాయి.

బ్రాహ్మణ కాలవ ఘటనే ఉదాహరణ

రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ టీడీపీకి పట్టున్న గ్రామం. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లు బయటి నుంచీ రావాల్సిందే. ఎక్కడైనా ఒక పార్టీకి గట్టి బలమున్న చోట ప్రత్యర్థి పార్టీల ఏజెంట్లకు రక్షణ వుండదు. అలాంటి చోట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తేనే బలహీనంగా వున్న వర్గంపై బలమైన వర్గం ఆధిపత్యం చెలాయించకుండా వుంటుంది. అక్కడ వైసీపీ ఏజెంట్లపై దౌర్జన్యం జరిగిందని ప్రచారం జరగడంతో వైసీపీ అభ్యర్థి భారీగా అనుచరులను వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్ళడం, దాంతో గ్రామస్థులు ఆగ్రహంతో రెచ్చిపోవడం జరిగాయి. ఈ ఉద్రిక్తతలే గాల్లోకి కాల్పులు జరపడానికి దారి తీశాయి. ఇక్కడ గత ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై దాడి జరిగినంత పనైంది. ఇలాంటి చరిత్ర వున్న పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు తగిన విధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలున్నాయి.

స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థల ఎంపికపై విమర్శలు

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయడమే సరైంది కాదన్న వాదన వినిపిస్తోంది. పద్మావతీ వర్సిటీ విశాలమైంది, అనువైన భవనాలు కలిగివున్నదీ అయినప్పటికీ ఇతర అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. వర్సిటీ ప్రహరీ ఆనుకునే తుమ్మలగుంట గ్రామం వుంది. అది వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి స్వస్థలం. వారికి అక్కడ గట్టి పట్టుంది. పది నిమిషాల వ్యవధిలో వెయ్యిమందిని పోగేసే పరిస్థితి వుంది. అలాగే వర్సిటీకి చేరువగానే టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నివాసం వుంటున్నారు. ఆయనకూ స్థానికంగా ప్రాబల్యం వుంది. ఒక్క పిలుపుతో స్వల్ప వ్యవధిలో వెయ్యిమందిని రప్పించే జనబలముంది. ఉద్రిక్తతలు రాజ్యమేలే ఈ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను పద్మావతీ వర్సిటీలో కాకుండా మరో చోట మరింత భద్రతతో ఏర్పాటు చేసి వుండాల్సిందన్న వాదన వుంది.

నానీ గన్‌మ్యాన్ దుండగులపై కాల్పులు జరిపివుంటే?

పద్మావతీ వర్సిటీ ఆవరణలో మంగళవారం నానీపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేసినపుడు ఆయన గన్‌మ్యాన్ ధరణి నిబంధనలు పాటించారు. తొలుత గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే వెనక్కి తగ్గని వైసీపీ వర్గీయులు నేరుగా గన్‌మ్యాన్‌పైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలా కాకుండా గన్‌మ్యాన్ నేరుగా దాడి చేసిన వారిపై కాల్పులు జరిపివుంటే ఎన్ని మరణాలు సంభవించివుండేవి? తర్వాత పర్యవసానాలు ఎలా వుండేవి? అన్న ప్రశ్నలకు సమాధానాల్లేవు.

రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలతోనూ మేలుకోని వైనం

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు రాత్రి దాడులు, ప్రతిదాడులతో భయానక వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయుల దాడిలో పదిమంది గాయపడగా, ప్రతిదాడిలో వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు వాహనాలు తగులబడ్డాయి. బ్రాహ్మణకాలవతో పాటు ఈ రెండు గ్రామాలకు కూడా వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి స్వయంగా వెళ్ళారు. అధికార పార్టీ అభ్యర్థి మందీ మార్బలంతో వెళ్ళడం వల్లే మూడుచోట్లా ఉద్రిక్తతలు పెరిగాయన్న ఆరోపణలున్నాయి. కనీసం అపుడైనా పోలీసు యంత్రాంగం మేలుకొని పరిస్థితులు అదుపులోకి వచ్చేదాకా వైసీపీ అభ్యర్థిని గృహ నిర్బంధంలో వుంచాల్సింది. అది కూడా చేయలేదు. వైసీపీ దాడులకు టీడీపీ నుంచీ ప్రతిదాడులుంటాయన్న ప్రాథమిక అంచనా కూడా పోలీసు యంత్రాంగానికి లేకపోవడం గమనార్హం. ఇరు పార్టీల అభ్యర్థులకూ షాడో పార్టీలు వేయాలన్న ఆలోచన కూడా చేయలేదు.

నానీపై దాడి పోలీసు వైఫల్యానికి నిదర్శనం

మహిళా వర్సిటీ ఆవరణలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు జరిపిన దాడి పోలీసు వైఫల్యానికి పరాకాష్ఠగా చెప్పాలి. మహిళా వర్సిటీలో విద్యార్థినులు, వర్సిటీ ఉద్యోగులు తప్ప ఇతరులు ప్రవేశించే అవకాశమే లేదు. అందునా వర్సిటీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వర్సిటీ ఆవరణలోకి ప్రవేశ ద్వారాలు రెండు వుండగా రెండు చోట్లా ప్రాథమిక తనిఖీల తర్వాతే లోనికి అనుమతి లభించాలి. కానీ మంగళవారం రోజు ఇవేమీ కనిపించలేదు. మారణాయుధాలు ధరించిన వైసీపీ వర్గీయులు యథేచ్ఛగా వర్సిటీ ఆవరణలోకి వెళ్ళి నానీపై దాడికి దిగి ఆయనను, గన్‌మ్యాన్‌ను గాయపరిచారు. వాహనాలు ధ్వంసం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లున్న వర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేయకపోవడమే ఆశ్చర్యంగా వుంది.

దాడి పర్యవసానాలను అదుపు చేయలేకపోయిన యంత్రాంగం

నానీపై దాడి జరిగిన అరగంట వ్యవధిలో చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా కనీసం ఐదారు వందలమంది కార్యకర్తలు వర్సిటీ వద్దకు చేరుకుని ప్రతిదాడులకు దిగారు. దాన్ని అంచనా వేసి అదుపు చేయడంలో కూడా పోలీసు యంత్రాంగం దారుణంగా విఫలమైంది. కేంద్ర బలగాలు తిరుపతిలోనే వున్నా కూడా సకాలంలో వర్సిటీ వద్దకు రప్పించలేని దుస్థితిలో అధికారులు వుండిపోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిపై మారణాయుధాలతో స్ట్రాంగ్ రూములున్న వర్సిటీ ఆవరణలో హత్యాయత్నం జరిగినా రెండున్నర గంటల తర్వాత గానీ ఎస్పీ అక్కడికి రాలేదు.

చంద్రగిరి ఆర్వో ఏమి చేస్తున్నారు?

జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గం సమస్యాత్మకం. ఈ విషయం అటు పోలీసు రికార్డులు, ఇటు ఎన్నికల రికార్డులూ వెల్లడిస్తున్నాయి. ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా తిరుపతి ఆర్డీవో వ్యవహరిస్తున్నారు.నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, జిల్లా యంత్రాంగానికి ముందస్తు అంచనా నివేదికలు అందజేయడం ఆ అధికారి బాధ్యత. పోలింగ్ రోజు ఘటనలను బట్టి పోలీసు అధికారులతో సమీక్షించడం, ఘర్షణల పర్యవసానాలను అంచనా వేయడం, తదనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవడం కూడా ఆ అధికారి బాధ్యత. అయితే చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో ప్రేక్షకపాత్ర పోషించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా కూడా ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడడం, పోలీసులు లాఠీచార్జి జరపాల్సి రావడం, ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి జరగడం తెలిసిందే. అప్పట్లో కూడా ఆర్వో సరైన చర్యలు, ముందు జాగ్రత్తలు తీసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలు వచ్చాయి.

పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికీ పలు గ్రామాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన హత్యాయత్నానికి ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదు. ఇరువైపులా అభ్యర్థులకు ప్రమాదం వెన్నంటే వుంది. అనుచర గణం, గన్‌మెన్ లేకుండా ఇరువురూ స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రమాదం వారి కుటుంబ సభ్యులకు కూడా పొంచి వుంది. అలాగే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి, పద్మావతీ వర్సిటీ ఘటనలకు సంబంధించిన కేసుల్లో జరిగే అరెస్టులు కూడా ఆయా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించనున్నాయి. కఠినంగా వ్యవహరించని పక్షంలో ప్రతీకార దాడులు జరిగే అవకాశాలున్నాయి.

నానీపై హత్యాయత్నం చేయించిందెవరు?

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం వెనుక వున్న కీలక వ్యక్తులు ఎవరో ఇప్పటికే వెల్లడైంది. రామచంద్రాపురం మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకులు వల్లేటి భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి ఈ దాడిలో కీలకంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. వారితో పాటు వారి అనుచరులు పాల్గొన్నట్టు వీడియో ఫుటేజీలు కూడా పోలీసులకు లభ్యమయ్యాయి. అయితే వారితో దాడి చేయించింది ఎవరన్నది ప్రశ్నగా మారింది. ఏ కారణాలతో వారు మారణాయుధాలతో దాడికి దిగారు? ఎవరి కోసం అంత రిస్కు తీసుకున్నారు? దాడి వెనుక ముందస్తు ప్రణాళిక వుందా? దాడికి పాల్పడిన వారికి భారీగా లబ్ధి చేకూరే ప్యాకేజీ వంటిదేమైనా వుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి వుంది.

స్విమ్స్ నుంచి నానీ డిశ్చార్జి

నానీకి నారాయణ పరామర్శ



తిరుపతి(వైద్యం), మే 15 : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం డిశ్చార్జి చేశారు. భుజంపై తగిలిన గాయం ఇంకా పూర్తిగా నయం కాలేదని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు ఆయనకు సూచించారు. నానీ డిశ్చార్జి సమాచారంతో పలువురు టీడీపీ శ్రేణులు ఉదయం నుంచే స్విమ్స్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఇంటివద్ద నానీని వందలాదిమంది టీడీపీ శ్రేణులతో పాటు సీపీఐ నేత నారాయణ, సినీ నటుడు శివాజీ తదితర ప్రముఖులు పరామర్శించారు.

నానీపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అదుపులోకి

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, మే 15 : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు బుధవారం ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.ప్రధాన నిందితులుగా గుర్తించిన రామచంద్రాపురం జడ్పీటీసీ ఢిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దాడికి పాల్పడిన వారందరూ లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటి ఇంటి వద్ద సెంట్రింగ్ పనివారుగా గుర్తించినట్లు సమాచారం. తిరుపతి, రామచంద్రాపురం పోలీసులు బుధవారం అనుపల్లిలో 12మందిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తిరుపతికి తరలించారు.వారిలో ఎనిమిది మందిని విడిచిపెట్టి నలుగురిని విచారిస్తున్నట్లు సమాచారం. కాగా మహిళావర్సిటీ వద్ద మంగళవారం అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి దాదాపు 10 మందిని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నారు.

చెవిరెడ్డి రాకతో ఎంఆర్‌పల్లి స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి(నేరవిభాగం), మే 15 : టీడీపీ అభ్యర్థి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు కొంతమంది వైసీపీ కార్యకర్తలను బుధవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు.అయితే కేసులో ఐదుగురి పేర్లు చూపించి 11 మందిని ఎందుకు తీసుకొచ్చారంటూ ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి బుధవారం రాత్రి హుటాహుటిన ఎంఆర్ పల్లి స్టేషన్ వద్దకు చేరుకున్నారు.అక్కడ భారీఎత్తున పోలీసులను మొహరింపజేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. దాదాపు గంట తరువాత చెవిరెడ్డికి ఏఎస్పీ కులశేఖర్ సర్ది చెప్పగా వారక్కడినుంచీ వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ






పుట్టమన్ను సేకరణ - సేనాధిపతి ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), మే 15: తిరుపతిలోని గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా బుధవారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య అర్చక స్వాములు, వేదపండితులు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం 8.15 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో చిరుత సంచారం



తిరుమల, మే15(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో చిరుతపులి సంచారం మరోసారి కలకలం సృష్టించింది. ఈ నెల 12వ తేదీ వేకువజామున 5 గంటల సమయంలో శ్రీవారి దర్శనార్థం ఓ భక్తబృందం కారులో వెళుతుండగా మార్గ మధ్యంలో ఓ చిరుత రోడ్డు దాటింది. దీంతో కారులోని భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై వేగంగా తిరుమల చేరుకున్నారు. అయితే కారు డ్యాష్ కెమెరాలో రికార్డయిన వీడియోను ఆ భక్త బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ప్రస్తుతం ఆ వీడియో నెటింట్లో వైరల్‌గా మారింది.

శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా ఎల్లుండి విడుదల

తిరుమల, మే15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను టీటీడీ ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు మే 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులు అదే రోజు మధ్యాహ్నం 12 గంటల లోపు టికెట్ ధర చెల్లించి లక్కీడిప్ టికెట్‌ను పొందవచ్చు.కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటా, అలాగే శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను మే21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లను కూడా విడుదల చేస్తారు. భక్తులు వీటి కోసం టీటీడీ అధికార వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్'ను సంప్రదించాల్సి ఉంటుంది.

నేటినుంచి ఈఏపీసెట్

- హాజరుకానున్న 28,390మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 15: ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షలు ఈనెల 23 వరకు జరుగుతాయి. తిరుపతి, పుత్తూరు, గూడూరుప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరుపతి కేంద్రంగా అత్యధికంగా 18,214 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పుత్తూరు కేంద్రంగా 4,062 మంది, గూడూరు కేంద్రంగా 6,114 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం 28,390 మంది విద్యార్థులు ఈఏపీసెట్‌కు హాజరుకానున్నారు. 16, 17 తేదీల్లో బైపీసీ విద్యార్థులకు సంబంధించి ఏజీ బీఎస్సీ, బీవీఎస్సీ, బీఫార్మశీ, ఫిజియోథెరపీ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు జరుగనున్నాయి. 5,539 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. 18 నుంచి 23వ తేదీ వరకు ఎంపీసీ విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశానికి పరీక్షలు జరుగనున్నాయి. 22,735 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఎంబైపీసీ చదివిన విద్యార్థులు 116 మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు రాయనున్నారు.



చిట్టేపల్లి తిప్ప వద్ద ఆగి వున్న ట్యాంకర్లు, ప్లాంట్

నిర్వహణ లోపం..
మూతపడిన శుద్ధిజలం ప్లాంట్లు

• తాగునీటి కోసం ప్రజల అవస్థలు

పొదలకూరు, మే 15: మండలంలోని 30 పంచాయతీల ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని వైసీపీ గాలికొదిలేసింది. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బయట కొనుక్కునే ఆర్థిక స్థోమత లేక స్థానికంగా లభించే నీటి వనరులనే వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. పొదలకూరు మేజర్ పంచాయతీ చిట్టేపల్లి తిప్ప వద్ద గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గత ప్రభుత్వం 2019లో రూ.4కోట్లు వెచ్చించి పథకాన్ని ప్రారంభించారు. నీటి సరఫరా నిమిత్తం కొత్త ట్రాక్టర్లు సైతం కొనుగోలు చేశారు. ఇప్పటికి నాలుగేళ్లుగా పథకం, ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ వేసవికైనా శుద్ధజలం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

• దోమల బాధతో ప్రజల ఇక్కట్లు

ఇందుకూరుపేట, మే 15 : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. నిధుల కొరత కారణంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి, దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దోమలు దండెత్తి పల్లెవాసులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో నిధుల లేమి కారణంగా పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికను తొలగించడం లేదు. ఇటీవల ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెబుతున్న పాలకులు.. గ్రామాల్లో పారిశుధ్యంపై మాత్రం దృష్టి పెట్టడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. చాలా గ్రామాల్లో నివాసాల చెంత మురుగు నీరు నిలిచి ముందుకు కదలడంలేదు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు.



జగదేవిపేటలో ఇళ్ల మధ్యలోనే చెత్తకుప్పలు

సీబీఎస్ఈ ఫలితాల్లో 'సింహపురి' ప్రతిభ



స్కూల్ ఫస్ట్ వచ్చిన వారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు, మే 15 : టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో సింహపురి ఇంటర్నేషనల్ స్కూల్ ఉత్తమ ప్రతిభతో మంచి ఫలితాలు సాధించినట్లు స్కూల్ చైర్మన్ దగ్గు శివకుమార్ తెలిపారు. మండలంలోని పేడూరు రోడ్డులో ఉన్న పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సీబీఎస్ఈ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని, తమ పాఠశాలకు చెందిన ఎస్ శ్రీవర్ధిని 433, ఆర్ నిర్మల జెస్సీ 415, డి ఉమేష్‌సాయి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో పదో తరగతి మొదటి బ్యాచ్ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజిత, ప్రిన్సిపాల్ రాణిమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

• బెంబేలెత్తుతున్న జనం

వెంకటాచలం, మే 15: గత మూడు రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం నుండే ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు ఉక్కపోత కారణంగా బయట తిరగాలంటే హడలి పోతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఈవిధగా ఉంటే మే నెల చివరలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలు ఇదే విధంగా కొనసాగితే భూగర్భ జలాలు కూడా అడుగంటిపోయి తాగు నీటికి కూడా ప్రజలు అల్లాడే పరిస్థితి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు.

వైసీపీ పాలనలో స్థానిక సంస్థలకు
నిధుల్లేవు.. గౌరవం లేదు

• జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు అందని వేతనాలు
• 17 నెలలుగా ఎదురుచూపులు

పొదలకూరు, మే 15 : స్థానిక సంస్థలను జగన్ ప్రభుత్వం నిస్తేజంగా మార్చింది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సొంతానికి వాడేసుకుంది. విద్యుత్ చార్జీలు, ఇతరత్రా బకాయిలు కోసం నిధులను మళ్లించడంతో అభివృద్ధి పనులు చేసే అవకాశం లేకుండా పోవడంతో ప్రజాప్రతినిధులంతా ఈ ఐదేళ్లపాటు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. చివరకు వారికి గౌరవం లేకుండా చేసింది. నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు సకాలంలో అందలేదు. జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు 2022 నవంబరు నుంచి వేతనాల్లేవు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎంపీటీసీలు -544, జడ్పీటీసీలు 46 మంది ఉన్నారు. వైసీపీ వచ్చాక పంచాయతీ ప్రధాన పౌరులైన సర్పంచులు చిన్నచూపునకు గురయ్యారు. 50 మంది కుటుంబాలకు నియమించిన ఒక వాలంటీరుకు నెలకు రూ.5వేలు వేతనమిస్తే, గ్రామ పెద్ద సర్పంచ్‌కు మాత్రం ఇచ్చేది రూ.3వేలే. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ఎన్నికైన వారిలో పేదలే ఎక్కువ మంది. ఓవైపు ప్రభుత్వ పనులు లేకపోవడం, ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు కావడం, గౌరవ వేతనం రాక ఇబ్బంది పడుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్టోబరు నుంచి డిసెంబరు త్రైమాసికానికి జనవరిలో, జనవరి నుంచి మార్చి వరకు ఏప్రిల్‌లో చెల్లించారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించేవారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సాధారణ నిధులు చెల్లించి, తర్వాత సర్దుబాటు చేసేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. సాధారణ నిధులు ఏమూలకూ చాలకపోవడంతో ప్రభుత్వం ఇస్తే తప్ప చెల్లింపులు సాధ్యం కాలేదు. నెలకు జిల్లా పరిషత్తు చైర్మన్‌కు రూ.40వేలు, జడ్పీటీసీ రూ.6వేలు, ఎంపీపీ రూ.6వేలు, ఎంపీటీసీలకు రూ.3వేలు చొప్పున ఇవ్వాలి. ఎంపీపీ, ఎంపీటీసీలకు మండల పరిషత్‌లు ఇవ్వాలి. వాటికి జడ్పీ నుంచి వస్తాయి. అయితే కొన్ని నెలలుగా ఆ ప్రక్రియ ఆగిపోయింది. చెల్లింపులు సాధ్యం కాలేదు. ఎంపీపీ, ఎంపీటీసీలకు మండల పరిషత్‌లు ఇవ్వాలి. వాటికి జడ్పీ నుంచి వస్తాయి. అయితే కొన్ని నెలలుగా ఆ ప్రక్రియ ఆగిపోయింది.

వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న విజయను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

వెంకటాచలం, మే 15 : విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సీహెచ్ విజయ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భం గా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేషన్ సభ్యులు ఆమెను కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన ప్రిన్సిపాల్ విజయ మాట్లాడుతూ యూనివర్సిటీ వీసీ సుందరవల్లి ఆధ్వర్యంలో సాధించుకున్న న్యాక్ ఏగ్రేడ్‌ను దృష్టిలో ఉంచుకొని అందరం సమిష్టిగా పనిచేసి భవిష్యత్తులో యూనివర్సిటీకి మంచి పేరు తీసుకుని వస్తానన్నారు. వర్సిటీ కళాశాల అభ్యున్నతికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

అల్లూరు, మే 15 : అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడిన వారికి వెంటనే గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

● 'అంబేడ్కర్ స్టడీ సర్కిల్' పనులకు దశాబ్ద కాలం
● మహాత్మా జ్యోతిబా పూలే భవనానికి ఐదేళ్లు
● చిట్టడవిని తలపించేలా పెరిగిన చిల్లచెట్లు
● పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం



అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనం పునాదుల్లో పెరిగిన చెట్లు

భవనాల నిర్మాణం
పునాదులకే పరిమితం!

నెల్లూరు(వీఆర్సీ), మే 15 : జిల్లా కేంద్రంలో మహనీయుల పేర్లతో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్, మహాత్మజ్యోతిబాపూలే భవనాల నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. ఆ ప్రాంతాల్లో చిల్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోన్నాయి. ఈ భవనాల నిర్మాణాన్ని ఎప్పుడు చేపడతారని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దశాబ్ద కాలం క్రితం సుమారు రూ.5.50 కోట్లతో నగరంలోని కొండాయపాలెం గేటు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం పునాదుల దశ దాటలేదు. ఐదేళ్ల క్రితం పునాదులు వేసిన మహాత్మజ్యోతిబాపూలే (బీసీ) భవనం నిర్మాణం పరిస్థితి అంతే. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ భవనాల పనులు నిలిపి వేసింది. ఆ తర్వాతనైనా పనులు ప్రారంభించారా అంటే అదీ లేదు. అప్పటి వరకు పనులు చేపట్టిన గుత్తేదారు బిల్లులు రాక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పునాదులు వరకు చేపట్టిన పనులు అలాగే ఆగిపోవడంతో భవన్ నిర్మించ తలపెట్టిన స్థలం చిట్టడవిలా తయారైంది. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి డంపింగ్ యార్డులా మారింది. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అనే పదం ప్రతి సమావేశంలో ఉచ్చరించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలకు గతంలో ఉన్న 25 పథకాలను రద్దు చేసిన ఘటనపై దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నా. తమకు దైవ సమానులుగా భావించే అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనాలు పునాదుల్లో ఆగిపోవడంతో దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పునాదుల దశ దాటని మహాత్మజ్యోతిబా పూలే భవనం

● సామాజిక పరివర్తకుడు మహాత్మజ్యోతిబా పూలే భవన నిర్మాణంలో కూడా అదే జాప్యం జరుగుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బీసీ సంక్షేమ భవనానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారంలోనికి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గతంలో చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఆనవాళ్లు లేకుండా చేసి హడావిడిగా మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. బీసీల కంటితుడుపు చర్యగా కొద్దిపాటి పనులు చేసి అలా అర్ధాంతరంగా పనులు నిలిపి వేశారు. ఇక నాటి నుంచి నేటి వరకు ఒక్క ఇటుక రాయి కూడా పెట్టిన పాపానపోలేదు. దేశంలోనే ఇంతటి పేరున్న మహనీయుల పేరుతో నిర్మించనున్న ఈ భవనాలకు మోక్షమెప్పుడు వస్తుందోనని పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

నారాయణకు బాలయ్య సేన సన్మానం



నారాయణను సన్మానిస్తున్న బాలయ్య సేన నాయకులు

నెల్లూరు(వైద్యం), మే 15 : మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణను బాలయ్య సేన నేతలు బుధవారం నగరంలోని నారాయణ నివాసంలో కలిసి సన్మానించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య పటాన్ని బహూకరించారు. అలాగే కిరీటధారణ చేసి పుష్పగుచ్ఛం అందజేశారు. నారాయణ ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహర్నిశలు శ్రమించి తన గెలుపు కోసం కృషి చేసిన బాలయ్య సేన నేతలను నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య సేన జిల్లా కన్వీనర్ వై.రవి, శ్రీధర్‌రెడ్డి, కేసీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సల సంఖ్య పెంచండి

• జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్



మాట్లాడుతున్న డాక్టర్ సిద్దానాయక్

నెల్లూరు(వైద్యం), మే 15 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సర్జరీ విభాగంలో శస్త్ర చికిత్సలు పెంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ సూచించారు. బుధవారం జీజీహెచ్‌లోని సర్జరీ విభాగంలో హెచ్‌వోడీ, వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనరల్ సర్జరీ విభాగంలో రిస్క్ కేసులు ఎట్టి పరిస్థితిలో బయటకు పంపవద్దన్నారు. రిస్క్ కేసులు ఛాలెంజీగా తీసుకుని వైద్య చికిత్స అందించాలని తెలిపారు. ఆపరేషన్ తర్వాత రోగులు తగిన జాగ్రత్తలు తీసుకునేలా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేస్తే ఆసుపత్రికి నిధులు వస్తాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ సేవలు పెంచాలని ఆదేశించారు. అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ కాలేషాబాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి



రాజరాజేశ్వరిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), మే 15 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీరాజరాజేశ్వరి అలంకారం వైభవగా జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మూలవరులకు విశేష పుష్పాలంకారం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ధర్మకర్త లు, ఉభయ కర్తలు పర్యవేక్షించారు.

రేపు వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కందుకూరి చెంగయ్యాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, కలిశ తీర్థం, అభిషేకాలు, పుష్పాలంకారం, హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ, రాత్రి 7 గంటలకు భరతనాట్య ప్రదర్శన, 8 గంటలకు కోలాటం ప్రదర్శనలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

హరిహరమూర్తి అలంకారం



హరిహరమూర్తి అలంకారంలో మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు బుధవారం 4వ రోజుకి చేరాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష పూజలు, పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం హరిహర మూర్తి అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రాకార ఉత్సవం, తోటల్లో స్వామివారిని వేంపు చేసి, కుంభహారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

జేఎస్ రెడ్డికి వెంకయ్యనాయుడు నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 : బెంగళూరులో బుధవారం నిర్వహించిన జేఎస్ రెడ్డి ఉత్తరక్రియల్లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయడు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేఎస్ రెడ్డి తనకు మిత్రుడు అని, ఆయన లేని లోటు ఆయన కుటుంబం, ఆయన సంస్థలకే కాదు సమాజానికి తీరనిలోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

433 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధ వారం రైతులు మొత్తం 455 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14కంపెనీ ప్రతినిధులు పాల్గొని 433 బేళ్లు కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.270.08గా నమోదైంది.

మదర్ కేర్‌పై అవగాహన

నెల్లూరు(వైద్యం), మే 15 : నగరంలోని రిచ్ ఆసుపత్రిలో ఇంటర్ నేషనల్ కాంగారూ మదర్ కేర్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ తల్లులు చేతులు, ఛాతిని శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లి చర్మం తాకిడితో బిడ్డకు తగినంత వెచ్చదనం వస్తుందని చెప్పారు. ఇది బిడ్డ త్వరగా పెరగటానికి, ఏడుపు తగ్గుతుందని, దీన్నే కాంగారు కేర్ అంటారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవ్యశ్రీ, హరీషా, అమృత, సీఈవో డాక్టర్ భాస్కర్, జీఎం ఆనంద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424